



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును

భూమి ప్లాట్ నిర్వహణ - అమ్మకం, అద్దె, కొనుగోలు లేదా పెట్టుబడి కోసం నివాస ప్రాంతంలో భవన నిర్మాణం మరియు గృహ ఉపవిభాగానికి అందుబాటులో ఉన్న ఖాళీ పొడి నేల భూమి ప్లాట్‌తో రియల్ ఎస్టేట్ భావన.




కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066


సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 155 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 26 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-







## మొబైల్ వినియోగదారులపై కార్పొరేట్ సంస్థల 'డిజిటల్' దౌర్జన్యం

- 15 ఏళ్ల నమ్మకానికి 'నో సిగ్నల్'.. సామాన్యుడి మెడకు 'పోస్ట్‌పెయిడ్' ఉచ్చు!
- రీ-వెరిఫికేషన్ ముసుగులో కస్టమర్ల బ్లాక్‌మెయిల్
- పాత కనెక్షన్లపై కన్నేసిన టెలికాం రాబందులు
- బలవంతంగా పోస్ట్‌పెయిడ్‌లోకి మార్పు.. ఒప్పుకోకపోతే సిమ్ కట్
- ఓటీపీలు రాక, సేవలు స్తంభించి రోడ్డున పడుతున్న సామాన్యుడు
- నిద్రమత్తులో 'ట్రాయ్'.. ప్రేక్షకపాత్రలో టెలికాం శాఖ

**కాకినాడ, (విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి):**

ఉదయం నిద్రలేచి చూసేసరికి ఫోన్‌లో "నో సర్వీస్" లేదా "సిమ్ డీయాక్టివేటెడ్".. ఇదేదో టెక్నికల్ సమస్య అనుకుని ఆందోళనగా నెట్‌వర్క్ స్టోర్‌కు పరుగులు తీస్తున్న సామాన్యుడికి టెలికాం సిబ్బంది దిమ్మతిరిగే షాకిస్తున్నారు. "మీ నంబర్ రీ-వెరిఫికేషన్ చేయాలి. ఇకపై ఇది ప్రీపెయిడ్‌లో పనిచేయదు, పోస్ట్‌పెయిడ్‌కు మారాల్సిందే" అని నిర్మొహమాటంగా తేగేసి చెబుతున్నారు. పదిహేనేళ్లుగా ఒకే నంబర్‌ను ప్రాణంగా వాడుకుంటున్న లక్షలాది మంది వినియోగదారులపై కార్పొరేట్ టెలికాం కంపెనీలు పన్నిన సరికొత్త వల ఇది. ఏళ్ల తరబడి తమ నెట్‌వర్క్‌ను నమ్ముకున్న కస్టమర్ల జేబులు గుల్ల చేసేందుకు కంపెనీలు ప్రయోగిస్తున్న ఈ 'పోస్ట్‌పెయిడ్' ఉచ్చు మిగతా .. 2లో..

### ఉగ్రవాదానికి
## భారత్ వ్యతిరేకం

**ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రధాని మోదీ**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉగ్రవాదానికి తాము పూర్తి వ్యతిరేకమని, భారత్ అనేక దశాబ్దాలుగా ఈ సమస్యతో ఇబ్బంది పడుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించిన ఆయన.. ఉగ్రవాదంపై పోరులో ఆ దేశానికి పూర్తిగా అండగా ఉంటామన్నారు. ఇక్కడ ప్రసంగించిన తొలి భారత ప్రధానిని తానేనని, దీనిని గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. రెండోసారి ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. భారత్, ఇజ్రాయెల్‌లు ప్రాచీన నాగరికత కలిగిన దేశాలని గుర్తుచేశారు. "ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ మిగతా .. 2లో..

## మూడోసారి అధ్యక్షుడిని అయ్యేవాడినే..



**ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా గతంలో కన్నా బలంగా, మెరుగ్గా, సుసంపన్నంగా మారిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థికవ్యవస్థ మునుపెన్నడూ లేనివిధంగా మిగతా .. 2లో..

## 'సేవ్ పునర్విక'..

**రూ.6 కోట్లు సమకూర్చడం నా బాధ్యత మంత్రి లోకేశ్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్ఎంఏ టైప్ -1తో బాధపడుతున్న కర్నూలుకు చెందిన పునర్విక అనే బాలిక చికిత్సకు సాయం చేసేందుకు మంత్రి నారా లోకేశ్ ముందుకొచ్చారు. సాయం చేయాలని బాలిక తల్లిదండ్రులు 'ఎక్స్'లో అభ్యర్థించడంతో మంత్రి స్పందించారు. ఈ అరుదైన వ్యాధితో కండరాలు క్రమంగా బలహీనపడతాయన్నారు. ఈ స్థితిలోనూ ధైర్యంగా పునర్విక పోరాడుతున్న తీరును కొనియాడారు. ఆమె ఇంజక్షన్‌కు రూ.16 కోట్లు అవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే దాతలు స్పందించి రూ. 10 కోట్లు సమకూర్చడం హర్షణీయమన్నారు. మిగిలిన రూ.6 కోట్లు సమకూర్చడం తన బాధ్యత అని చెప్పారు. ప్రతి ఒక్కరూ సాయం అందించాలని కోరారు. ఈ అంశంపై మంత్రి నారా లోకేశ్ స్పందించడంపై సినీ నటుడు మంచు మనోజ్ కృతజ్ఞతలు తెలిపారు.

### అతిసారం బాధితులను
## పరామర్శించిన మంత్రి నారాయణ



**శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని అతిసారం ప్రభావిత ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పర్యటించారు. మృతుడు సురేష్ కుటుంబాన్ని పరామర్శించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రితో పాటు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి పరామర్శించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అతిసారంపై అధికారులతో మంత్రి సమీక్షించారు. డయేరియా ప్రబలడానికి గల కారణాలు, అధికారులు తీసుకున్న చర్యలు, బాధితులకు అందుతున్న వైద్యసాయంపై చర్చించారు. "అతిసారంపై జిల్లా యంత్రాంగం వెంటనే అప్రమత్తమైంది. మొత్తం 102 కేసులు నమోదయ్యాయి. 85 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇద్దరు కిడ్నీ సమస్యతో ఇబ్బంది మిగతా .. 2లో..

### దేశానికే వ్యూహాత్మక
## ఖనిజాల నిలయంగా ఏపీ


- రేర్ ఎర్త్ ఎలిమెంట్ కారిడార్‌గా ఏపీ నిలవబోతోంది
- మైనింగ్ మాత్రమే కాకుండా వాల్యూ యాడెడ్ చైన్ అభివృద్ధి చేయాలి
- బీచ్ శాండ్ మినరల్స్ రంగంలో దేశాన్ని అగ్రస్థానంలో నిలుపుదాం
- రేర్ ఎర్త్ మినరల్స్ వర్క్ షాపులో మంత్రి మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను వెలికితీసి యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర గనులు భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నోవాటెల్ హోటల్‌లో ఏపీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీచ్ సాండ్ ఖనిజాల నుంచి టైటానియం, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్, శాశ్వత అయస్కాంతాలు - ఆంధ్రప్రదేశ్‌లో దేశీయ విలువ పెంపు గొలుసుల నిర్మాణం అవకాశాలు అనే అంశంపై నిర్వహించిన వర్క్ షాప్‌లో రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర పారిశ్రామిక మిగతా .. 2లో..

## ఏపీ పర్యాటక రంగానికి మహర్దశ

**శాసనమండలిలో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తూ భారీస్థాయిలో ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. బుధవారం శాసన మండలిలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు అడిగిన ప్రశ్నలకు మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘమైన, స్పష్టమైన సమాధానం ఇచ్చారు.

**ఉపాధి మరియు పెట్టుబడుల వెల్లువ:**

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 39,264 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించడం వల్ల గత 18 నెలల్లోనే రూ. 20,088 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, ఇది ఒక విప్లవాత్మక మార్పు అని మిగతా .. 2లో..

## ఎయిర్ అంబులెన్స్ క్రాష్..

**దానిలో బ్లాక్‌బాక్స్ లేదా..?**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఝార్ఖండ్‌లో ఎయిర్‌అంబులెన్స్ కూలిపోయిన ఘటనలో ఓ కొత్తకోణం వెలుగు చూసింది. దానిలో బ్లాక్‌బాక్స్ లేదని తెలుస్తోంది. దీంతో ప్రమాద కారణాన్ని తెలుసుకోవడం దర్యాప్తు అధికారులకు సవాలుగా మారనుంది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. విమానం బరువు 5,700 కిలోల కంటే తక్కువ ఉండటంతో దానిలో కాక్‌పిట్ వాయిస్ రికార్డర్, ఫ్లైట్ డేటా రికార్డర్ లేవు. పౌర విమానయాన నిబంధనల ప్రకారం ఈ బరువు కంటే తక్కువ ఉన్న విమానాల్లో వాటి అవసరం లేదు. ఈనేపథ్యంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో మిగతా .. 2లో..

## రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు బ్లూప్రింట్

- ఈ ఏడాది జూలైకి వెలిగొండ తొలిదశ పూర్తి చేసి నీళ్లు
- మార్కాపురం జిల్లాతో దశాబ్దాల కల సాకారం.. రూ.50 కోట్లతో కలక్టరేట్
- జిల్లా ఏర్పడ్డాక తొలిసారి వెళ్లిన ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం
- గత పాలకులు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమిచ్చేశారు
- వెలిగొండపై వైసీపీ డ్రామాలను ఎండగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులకు సీఎం శంకుస్థాపన
- మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ కళకళ బహిరంగ సభా వేదికలో సీఎం




**మార్కాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ ఏడాది జూలై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తిచేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్లు చేసి దొంగ నాటకాలు ఆడటం తమకు చేతకాదని సీఎం వ్యాఖ్యానించారు. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని సీఎం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. దీనికోసం విశ్రాంత ఇంజనీర్లతో ఓ బృందాన్ని వేసి అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు ఇచ్చే అంశంపై బ్లూ ప్రింట్ తయారు చేస్తామని అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లెలో రూ.456 కోట్లతో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రైతులతో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం మార్కాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ...'గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేటు ఇచ్చారు. అరకు మొదలుకొని ప్రకాశం వరకూ మంచి విజయం అందించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం, మదనపల్లి, పోలవరం ప్రాంతాలను జిల్లాలు చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు నిలబెట్టుకున్నాను. ఇక్కడి ప్రజలు 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలు కు వెళ్లాల్సిన పని లేకుండా మార్కాపురాన్ని జిల్లా చేశాను. అన్యాయం జరిగిన మదనపల్లికి న్యాయం చేశా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**శంకుస్థాపనతో పాటు ప్రారంభించే అవకాశం నాకే వచ్చింది**

1996,మార్చి 5న ఈ ప్రాంతంలో నేను పర్యటించినప్పుడు ప్రజల కష్టాలు కళ్లారా చూశాను. శ్రీశైలం నుంచి నీరివ్వమని ఇక్కడి ప్రజలు నన్ను కోరారు. ఆనాడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాం. భగవంతుడు మళ్లీ నాకే అవకాశం ఇచ్చాడు. వెలుగొండను పూర్తి చేసి మీ జీవితాల్లో వెలుగులు తెస్తాను. రైతులను మిగతా .. 2లో..

### నకిలీ వెబ్‌సైట్లతో
## జాగ్రత్త..



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమలలో వసతి గదులు ఇప్పిస్తామంటూ భక్తులను మోసం చేస్తున్న దళారులు, నకిలీ వెబ్‌సైట్లపై తితిదే అప్రమత్తమైంది. ఓ భక్తుడు మోసపోయిన ఘటనలో ఫిర్యాదు అందిన నేపథ్యంలో.. తితిదే విజిలెన్స్ విభాగం సమగ్ర విచారణ చేపట్టింది. విచారణలో తిరుమల శ్రీవారి ఆలయ చిత్రాలు, తితిదే పేరును అనధికారికంగా వినియోగిస్తూ నకిలీ వెబ్‌సైట్లు రూపొందించి భక్తులను తప్పుదారి పట్టిస్తున్నట్లు గుర్తించారు. ఫేక్ వెబ్‌సైట్ల ద్వారా భక్తుల నుంచి ఆన్‌లైన్ పేమెంట్ల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో నకిలీ వెబ్‌సైట్లపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### మొబైల్ వినియోగదారులపై

## కార్పొరేట్ సంస్థల 'డిజిటల్' దౌర్జన్యం

ఇప్పుడు సామాన్యుడికి ప్రాణసంకటంగా మారింది.

**కార్పొరేట్ కుట్ర.. 'వెరిఫికేషన్' నెపం**

టెలికాం రంగంలో ఇప్పుడు పాత కస్టమర్లే లక్ష్యంగా పగటి దోపిడీ నడుస్తోంది. ముఖ్యంగా ఏళ్ల తరబడి ఒకే నెట్‌వర్క్‌లో కొనసాగుతున్న వారిని, వ్యాపారాల కోసం ఫ్యాన్సీ నంబర్లు వాడుతున్న వారిని కంపెనీలు టార్గెట్ చేశాయి. టెలికాం శాఖ (ఐశీ) భద్రతా నిబంధనల ప్రకారం అడపాదడపా చేయాల్సిన కేవైసీ (ఖీజ) అప్‌డేట్‌ను ఇవి తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. డాక్యుమెంట్ వెరిఫికేషన్ పేరుతో వినియోగదారులను పిలిపించి.. బలవంతంగా వారిని ఖరీదైన పోస్ట్‌పెయిడ్ ప్లాన్లలోకి నెడుతున్నాయి. ప్లాన్ మారడానికి ససేమిరా అన్నవారి కనెక్షన్లను నిర్దాక్షిణ్యంగా కట్ చేస్తున్నాయి. ఫలితంగా నెలకు వందల రూపాయల అదనపు భారాన్ని భరించలేక, సిమ్ వదులుకోలేక కస్టమర్లు బలైపోతున్నారు.

**స్తంభించిన సేవలు.. ఆగమైపోతున్న జీవితాలు**

నేటి డిజిటల్ యుగంలో ఫోన్ సిగ్నల్ కట్ అవ్వడం అంటే కేవలం మాటలు ఆగిపోవడం కాదు.. ఓ మనిషి ఉనికే ప్రశ్నార్థకం కావడం. టెలికాం కంపెనీల ఏకపక్ష నిర్ణయంతో సామాన్యుల జీవితాలు అగమ్యగోచరంగా మారుతున్నాయి. బ్యాంక్ ఖాతాలకు, ఆధార్‌కు ఈ మొబైల్ నంబర్లే అనుసంధానమై ఉండటంతో.. సిగ్నల్ లేక ఓటీపీలు (ూా) రావడం లేదు. దీంతో ఏటీఎం లావాదేవీలు, ఫోన్‌పే, గూగుల్ పే లాంటి డిజిటల్ చెల్లింపులు పూర్తిగా నిలిచిపోతున్నాయి. గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోలేక, రేషన్ తీసుకోలేక పేదలు అల్లాడిపోతున్నారు. చిన్న వ్యాపారులు, చిరుద్యోగులు తమ కస్టమర్లతో, యజమానులతో కనెక్ట్ కాలేక ఉపాధి కోల్పోతున్నారు. ఇక అత్యవసర సమయాల్లో ఆసుపత్రుల పాలైనప్పుడు కనీసం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వలేని దయనీయ స్థితికి నెట్టబడుతున్నారు.

**నిద్రపోతున్న వ్యవస్థ.. పట్టించుకోని పాలకులు**

ఒకవైపు కార్పొరేట్ కంపెనీలు వినియోగదారుల హక్కులను బహిరంగంగా కాలరాస్తుంటే.. టెలికాం రంగాన్ని నియంత్రించాల్సిన రెగ్యులేటరీ అథారిటీ 'ట్రాయ్', కేంద్ర టెలికాం శాఖ (సంచార్ భవన్) చోద్యం చూస్తున్నాయి. కస్టమర్ స్పష్టమైన సమ్మతి లేకుండా బలవంతంగా ప్లాన్లు మార్చడం నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ దోపిడీని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం కూడా మొక్కుబడిగా తయారుకావడంతో కస్టమర్లకు న్యాయం జరగడం లేదు.

**'డిజిటల్ ఇండియా' దార్శనికత ఇదేనా?**

ప్రభుత్వం గొప్పగా చెబుతున్న 'డిజిటల్ ఇండియా'.. కేవలం కార్పొరేట్ కంపెనీల జేబులు నింపడానికేనా? అన్న ప్రశ్న ఇప్పుడు పాత మొబైల్ ఫోన్లు పట్టుకుని టెలికాం స్టోర్ల ముందు క్యూ లైన్లలో నిలబడిన ప్రతి సామాన్యుడి మదిలో మెదులుతోంది. ఈ దోపిడీపై ఇప్పటికైనా వ్యవస్థ మేల్కోవాలి. నిబంధనలను ఉల్లంఘిస్తున్న టెలికాం కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేదంటే, ఈ 'పోస్ట్‌పెయిడ్ ఉచ్చు'లో సామాన్యుడి డిజిటల్ భద్రత గాల్లో కలవడం ఖాయం.

**నిబంధనలు ఏం చెబుతున్నాయి?**

ట్రాయ్ నిబంధనల ప్రకారం కస్టమర్ అనుమతి లేకుండా ప్లాన్ మార్చడం చట్టవిరుద్ధం.

కేవైసీ అంటే కేవలం గుర్తింపు పత్రాల ధృవీకరణ మాత్రమే. దానికి, పోస్ట్‌పెయిడ్ ప్లాన్ కొనడానికి ఎలాంటి సంబంధం లేదు. టెలికాం స్టోర్ సిబ్బంది బెదిరిస్తే వెంటనే లి198లి కు కాల్ చేసి ఫిర్యాదు చేయండి. కంపెనీ వినకపోతే PORT <Space> మీ నంబర్ టైప్ చేసి 1900కి ఎస్ఎంఎస్ పంపి వేరే నెట్‌వర్క్‌కు మారండి. లేదా జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ 1915కు ఫిర్యాదు చేయండి.

## మూడోసారి అధ్యక్షుడిని అయ్యేవాడినే..

పరుగులు పెడుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో దేశాన్ని మరింత మెరుగుపరుస్తామన్నారు. అమెరికాకు ఇది స్వర్ణయుగం అని ట్రంప్ వ్యాఖ్యానిం చారు. మూడోసారి కూడా అధ్యక్షుడు కావాలన్న ఆశను ట్రంప్ ఇక్కడ ప్రస్తావించారు. రెండోదఫా అధ్యక్ష బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయ్యిందన్నారు. కానీ, ఇది తనకు మూడో దఫా కావాల్సిఉందని వ్యాఖ్యానించారు. ఎన్నో వింతలు జరిగాయంటూ.. 2020 అధ్యక్ష ఎన్నికల గురించి ప్రస్తావించారు. నాటి అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థి జో బైడెన్ చేతిలో ట్రంప్ ఓడిపోయారు. అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం.. ఒకరు రెండుసార్లు మాత్రమే అధ్యక్ష బాధ్యతలు చేపట్టగలరు. ట్రంప్ గతంలో కూడా మూడోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టడం గురించి మాట్లాడారు. గత ప్రభుత్వం నాలుగేళ్లలో అమెరికాలో 1 ట్రిలియన్ డాలర్ల కంటే తక్కువ పెట్టుబడులు తీసుకొస్తే.. ఒక్క సంవత్సరంలోనే తన కార్యవర్గం 18 ట్రిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు సాధించినట్లు తెలిపారు. అక్రమ వలసలను, ప్రాణాంతక ఫెంటనిల్‌లను సమర్థవంతంగా అడ్డుకున్నామన్నారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో నిర్బంధం తర్వాత.. ఆ దేశం నుంచి 80 మిలియన్ బ్యారెళ్లకు పైగా చమురు అమెరికాకు వచ్చినట్లు వెల్లడించారు.

**ఇంకా ఏమన్నారంటే...**

'2028లో అమెరికాలో ఒలింపిక్స్ జరగనున్నట్లు ప్రకటన'
'ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని నిర్మిస్తున్నాం'
'పౌరుల సంక్షేమానికే మా తొలి ప్రాధాన్యం'
'ఐదేళ్లలో ద్రవ్యోల్బణం అత్యల్పస్థాయికి తీసుకెళ్లాం'
'బిగ్ బ్యూటిఫుల్ బిల్‌తో అమెరికన్లకు ఉపశమనం'
'సుంకాలపై సుప్రీం తీర్పు దురదృష్టకరం'
'అక్రమ వలసదారులకు డ్రైవింగ్ లైసెన్స్ నిషేధించే చట్టానికి ఆమోదం'
'సేవ్ అమెరికా' చట్టాన్ని ఆమోదించాలని పిలుపునిచ్చిన ట్రంప్

## భారత్ వ్యతిరేకం

సమర్థించలేం. హమాస్ దాడి చేసి పౌరులను చంపడం దారుణం. శాంతిస్థాపన అనేది సులువైన విషయం కాదు. ఇజ్రాయెల్‌కు అనేక అంశాల్లో భారత్ అండగా నిలుస్తుంది. హమాస్ దాడుల తర్వాత మీ బాధలను మేం పంచుకున్నాం. ఉనికి కోసం యూదులు అనేక కష్టాలు పడ్డారు. పాలస్తీనా సమస్యలపై స్పందించాల్సిన సమయం వచ్చింది. ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ వైఖరి విడనాడాలి. భారత్ చర్చలు, శాంతిని కోరుకుంటోంది. ఇజ్రాయెల్ అందించిన సాంకేతిక పరిజ్ఞానం మరచిపోలేం. రక్షణ, భద్రత విషయంలో ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు జరిగాయి. ఇజ్రాయెల్ సాయంతో భారత్ వ్యవసాయ రంగంలో సరికొత్త మార్పులు వచ్చాయి" అని మోదీ పేర్కొన్నారు.

**మోదీ స్నేహితుడి కంటే ఎక్కువ: నెతన్యాహు**

ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించడం ఎంతో సంతోషకరమని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో మోదీకి స్వాగతం పలికిన అనంతరం ఆయన మాట్లాడారు. "ప్రపంచ దేశాల్లో నరేంద్ర మోదీ గొప్ప నాయకుడు. ఆయన మాకు స్నేహితుడి కంటే ఎక్కువ. మోదీ నేతృత్వంలో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. భారత్‌తో వాణిజ్య ఒప్పందాలు రెట్టింపు అయ్యాయి. భారత్, ఇజ్రాయెల్.. ప్రాచీన నాగరికత ఉన్న దేశాలు. అనేక విషయాల్లో ఇజ్రాయెల్‌కు భారత్ అండగా నిలబడింది" అని నెతన్యాహు పేర్కొన్నారు.

## ఏపీ పర్యాటక రంగానికి మహర్దశ

ఆయన అభివర్ణించారు. ఇందులో రూ. 9,445 కోట్లతో సుమారు 7,348 గదుల నిర్మా ణం జరుగుతోందని తెలిపారు. నూతన పర్యాటక పాలసీ 20 24-29తో పర్యాటక రంగంలో వినూత్న మార్పులు, విప్లవాత్మ క సంస్కరణలు తెచ్చా మన్నారు. అంతర్జా తీయ వేదికలపై ఏపీ బ్రాండ్‌ను పెంపొందించేకు కృషి చేశామన్నారు. తద్వారా పర్యాటక రంగంలో పెట్టుబడులు వెల్లువలా వచ్చాయని వివరించారు. ముఖ్యంగా సీఐఐ సమ్మిట్‌లో పెద్దఎత్తున ఎంవోయూలు కుదుర్చుకున్నామన్నారు.

**కేంద్ర ప్రభుత్వ సహకారం - నిధుల వివరాలు:**

కేంద్ర ప్రభుత్వంలోని పిలిగ్రిమ్ రెజువనేషన్ అండ్ స్పిరుచ్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్(ప్రసాద్), స్వదేశీ దర్శన్ 2.0, ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్ మెంట్ (సీబీడీడీ), స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్ మెంట్స్ (శాస్కి) తదితర పథకాల కింద రాష్ట్రానికి రూ.429.06 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి దుర్గేష్ వివరించారు. శాస్కి ద్వారా అఖండ గోదావరికి రూ.94.44 కోట్లు, గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియా అయిన గండికోట అభివృద్ధికి రూ. 77.91 కోట్లు, స్వదేశీ దర్శన్ 2.0 ద్వారా సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు, అరకులోయ బొర్రా గుహల ఎక్స్ పీరియన్స్ సెంటర్ అభివృద్ధికి రూ.29.88 కోట్లు, సీబీడీడీ ద్వారా అహోబిలం అభివృద్ధికి రూ.25 కోట్లు, ప్రపంచ స్థాయి బౌద్ధ గమ్యస్థానంగా నాగార్జున సాగర్ బౌద్ధ వారసత్వ కేంద్రాల అభివృద్ధికి రూ.25 కోట్లు, ప్రసాద్ ద్వారా అన్నవరం, సింహాచలం వరహాలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానాల్లో నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 54.04 కోట్లు మంజూరు అయ్యాయని, ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో శరవేగంగా పనులు జరుగుతున్నాయని వివరించారు.

**కొత్త ప్రతిపాదనలు - పర్యాటక సర్క్యూట్లు:**

ఇప్పటికే కేంద్రానికి మరిన్ని ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రసాద్ పథకం క్రింద గుంటూరు జిల్లాలో మంగళగిరి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి, శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, అరసవెల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధి, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, శ్రీ గృహమల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి, తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామన్నారు. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద కృష్ణా జిల్లా మచిలీపట్నం వద్ద మచిలీపట్నం బీచ్ ను వైబ్రాంట్ బీచ్ గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామని వివరించారు. ఇవి కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ ను కలిసి డీపీఆర్ లు అందించామన్నారు. అదే విధంగా రాష్ట్రంలో పర్యాటక సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తున్నామని చెబుతూ విశాఖ-అరకు, విశాఖ-సింహాచలం-అరసవిల్లి, రాజమహేంద్రవరం సర్క్యూట్, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి ప్రత్యేక సర్క్యూట్, అమరావతి, తిరుపతి లలో వివిధ రకాల సర్క్యూట్ లు ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను మరింత పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కోనసీమలో హోమ్ స్టే పాలసీ తీసుకొచ్చి హోమ్ స్టేలను పెంపొదిస్తున్నామన్నారు.

## ఖనిజాల నిలయంగా ఏపీ

ప్రగతికి 'బీచ్ సాండ్ మినరల్స్' కీలకమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం దేశానికే వ్యూహాత్మక ఖనిజాల నిలయమనన్నారు.. రాష్ట్రాన్ని 'రేర్ ఎర్త్ ఎలిమెంట్ కారిడార్'గా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం దృఢంగా ముందుకు సాగుతోందన్నారు. ఖనిజాల వెలికితీత నుండి తయారీ హబ్‌గా ఏపీ రూపాంతరం చెంది 'స్వర్ణాంధ్రప్రదేశ్' దిశగా అడుగులు వేస్తుందన్నారు.. శ్రీకాకుళం నుండి మచిలీపట్నం వరకు విస్తరించి ఉన్న విస్తారమైన తీరప్రాంతం ఖనిజ సంపదతో సమృద్ధిగా ఉందన్నారు. ముఖ్యంగా బీచ్ సాండ్ ఖనిజాలు కేవలం ఆదాయ వనరులు మాత్రమే కాకుండా క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వెహికల్స్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు వ్యూహాత్మక వనరులుగా మారాయని పేర్కొన్నారు. తన నియోజకవర్గం మచిలీపట్నంలో కూడా ఈ ఖనిజ నిక్షేపాలు గణనీయంగా ఉన్నాయని వెల్లడించారు. గతంలో గనుల రంగం ఎదుర్కొన్న సవాళ్లను అధిగమిస్తూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పారదర్శకతను పునరుద్ధరించి సామర్థ్యాన్ని పెంచేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. మైనింగ్‌ను కేవలం ఆదాయ వనరుగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వృద్ధిని నడిపించే ఇంజన్‌గా ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఖనిజ బ్లాకుల వేలాలను వేగవంతం చేయడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై దృష్టి పెట్టడం, సాంకేతికత ఆధారంగా పారదర్శకత పెంపు వంటి చర్యలు చేపట్టామన్నారు. ఇటీవలి ఫోర్బ్స్ నివేదిక ప్రకారం దేశపు పెట్టుబడులలో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు రావడం రాష్ట్రంపై పెట్టుబడిదారుల నమ్మకానికి నిదర్శనమన్నారు. వాల్యూ చైన్ అభివృద్ధి, తయారీ హబ్‌గా ఏపీ కేవలం ఖనిజాల వెలికితీతకే పరిమితం కాకుండా, ప్రాసెసింగ్, తుది ఉత్పత్తుల తయారీ వరకు పూర్తి స్థాయి విలువ ఆధారిత వ్యవస్థను రాష్ట్రంలోనే ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సహజ వనరులను వినియోగించి పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన దిశగా మైనింగ్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 16,600 హెక్టార్లలో విస్తరించి ఉన్న 16 రకాల ఖనిజ నిక్షేపాలను గుర్తించామని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాన్ని 'రేర్ ఎర్త్ ఎలిమెంట్ కారిడార్' అభివృద్ధి కోసం గుర్తించడం గర్వకారణమన్నారు. రాష్ట్ర మైనింగ్, తయారీ రంగాలను బలోపేతం చేసి సంస్కరణలకు ప్రోత్సాహం అందిస్తున్న గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. బాధ్యతాయుతమైన మైనింగ్, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల స్థాపన వంటి అంశాలను సమగ్రంగా కలుపుకుని పూర్తి స్థాయి పర్యావరణ వ్యవస్థను నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు కలిసి పనిచేస్తే ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయిలో మైనింగ్ హబ్‌గా నిలబెట్టగలమని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న మాజీ డీఆర్‌డీఓ ఛైర్మన్, ప్రభుత్వ సలహాదారు డా. జి. సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా టైటానియం, రేర్ ఎర్త్ మాగ్నెట్లకు భారీ డిమాండ్ పెరుగుతోందన్నారు. రక్షణ, అంతరిక్ష, క్షిపణి సాంకేతికత, అధునాతన ఇంజినీరింగ్ రంగాల్లో ఈ పదార్థాల ప్రాముఖ్యత రోజురోజుకూ పెరుగుతోందని వివరించారు. స్వదేశీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా దిగుమతులపై ఆధారపడకుండ దేశం ముందుకు సాగగలదన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా లభించే బీచ్ సాండ్ ఖనిజాలను సాంకేతిక పరిజ్ఞానంతో విలువ పెంచితే అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీపడే స్థాయికి చేరుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు కలిసి పనిచేస్తే ఆంధ్రప్రదేశ్ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందని సతీష్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (గనులు) ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. దీర్ఘకాలిక ఖనిజ సరఫరా భద్రతతో పాటు పరిశ్రమలకు అనుకూల విధాన వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. సింగిల్ విండో వ్యవస్థ ద్వారా వేగవంతమైన అనుమతులు, పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. బీచ్ సాండ్ ఖనిజాల వినియోగంలో పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. పెట్టుబడిదారులకు దీర్ఘకాలిక విధాన స్థిరత్వం, స్పష్టమైన మార్గదర్శకాలు అందుబాటులో ఉంటాయని ముఖేష్ కుమార్ మీనా భరోసా ఇచ్చారు. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ.. పెట్టుబడిదారులకు ఎంతో అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక పార్కులు, పోర్ట్ కనెక్టివిటీ వంటి అంశాలు ఆంధ్ర ప్రదేశ్ కు ఉన్న బలాలని చెప్పారు. వేగవంతమైన నిర్ణయాలతో పరిశ్రమలు త్వరగా స్థాపన దశకు చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులు ఆకర్షించి ఉపాధి అవకాశాలు సృష్టించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేయనుంది. కార్యక్రమంలో జాతీయ స్థాయి శాస్త్రవేత్తలు, ఎమ్ఎస్ఎమ్ఈ పారిశ్రామికవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, తదితరలు పాల్గొన్నారు.

### అతిసారం బాధితులను

## పరామర్శించిన మంత్రి నారాయణ

పడుతున్నారు. 50 బృందాలతో డోర్ టు డోర్ సర్వే చేస్తాం. ఒకరు డయేరియాతో చనిపోయినట్టు గుర్తించాం. మరొకరు ఇంట్లోనే మృతి చెందారు. పోస్టుమార్టం నివేదిక వస్తే స్పష్టత వస్తుంది" అని మంత్రి నారాయణ మీడియాకు తెలిపారు.

## ఎయిర్ అంబులెన్స్ క్రాష్..

పైలట్ జరిపిన కమ్యూనికేషన్ రికార్డుల ఆధారంగానే ఇప్పుడు దర్యాప్తు చేయాల్సిఉంటుంది. అలాగే శిథిలాల విశ్లేషణ, ప్రత్యక్ష సాక్షుల కథనాలు విచారణకు కీలకంగా మారనున్నాయి. బ్లాక్‌బాక్స్‌లో రెండు భాగాలు ఉంటాయి. మొదటిది డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్ (డీఎఫ్‌డీఆర్), రెండోది కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్). డీఎఫ్‌డీఆర్.. కీలక పరికరాలైన ఫ్లాప్‌లు, ఎలివేటర్, రడ్డర్ స్థితిగతులతోపాటు విమానం ఎంత ఎత్తులో ఉంది, గాలి వేగం ఎంత, ఇంజిన్ పనితీరు ఎలా ఉంది వంటి సమాచారాన్ని నమోదు చేస్తుంది. సీవీఆర్ అనేది ఒక మల్టీ ట్రాక్ రికార్డరు. ఇది కాక్‌పిట్ నుంచి వెలువడిన ప్రతి శబ్దాన్నీ నిరంతరం రికార్డు చేస్తూనే ఉంటుంది.

## నకిలీ వెబ్‌సైట్లతో జాగ్రత్త...

తితిదే ఐటీ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తితిదే చిహ్నాలు, ఆలయ చిత్రాలను అనధికారికంగా ఉపయోగిస్తున్న వెబ్‌సైట్లపై కాపీరైట్ చట్టం కింద కేసులు నమోదు చేయించింది. దర్శనం, వసతి గదులు, సేవా టికెట్లను తితిదే అధికారిక వెబ్‌సైట్ **https://ttdevasthanams.ap.gov.in** ద్వారానే బుకింగ్ చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

## రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు బ్లూప్రింట్

ఆదుకుంటాం. 2014-2019లో ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించాం. ఈ ప్రాజెక్టు ద్వారా 4.35 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యం. దీని వల్ల గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలకే కాకుండా ఉదయగిరి, కడప జిల్లా బద్వేలుకు కూడా నీరు అందుతుంది. 2019లో మనమే అధికారంలోకి వచ్చి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీరిచ్చేవాళ్లం. 2019-2024 మధ్య చీకటి రోజులు వచ్చాయి. గత ముఖ్యమంత్రి వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ దొంగ నాటకాలు ఆడాడు. చీమకుర్తి, మార్కాపురం సభల్లో 2023లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చాడు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కటింగ్ చేశాడు. ఇలా చేయడం మోసం కాదా. నేను చేయగలిగిందే చెబుతున్నాను. వెలిగొండ ప్రాజెక్టుకు పూర్తికి రూ.9081 కోట్ల నిధులు కావాలి. ఇప్పటి వరకూ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు వ్యయం చేశాం. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేశాం. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశాం. ఇంకా రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపట్టాం. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశాను. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని రైతులకు పంగ నామాలు పెట్టారు. మంచి చేసిన వారికి అండగా నిలుస్తేనే ప్రజల జీవితాలు మెరుగు అవుతాయని ముఖ్యమంత్రి అన్నారు.

**రూ.1300 కోట్లతో ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు**

అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. ఎక్కడ పేదలు ఉంటే అక్కడ నేను ఉంటాను. ఎన్నికల్లో చెప్పినట్టే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పింఛన్ల కోసం ప్రతి ఏటా రూ.34 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీ శక్తి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. మగవారితో సమానంగా మహిళలకు అవకాశాలు రావాలని డ్వాక్రా సంఘాలు స్థాపించాను. ఈ ఏడాది లక్షమంది ఆడబిడ్డలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు మూడు విడతల్లో రూ. 20,000 ఇస్తున్నాం. 2027లో పుష్కరాలకు ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. నల్లమల సాగర్ కు గోదావరి నీళ్లు ఇస్తాం. అది వచ్చేలోగా ఈ ఏడాది జూలై నాటికి నల్లమల సాగర్ పూర్తి చేసి వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాజెక్టు కోసం ఇంకా రూ. 2 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. గతేడాది హంద్రినీవాపై శ్రద్ధ పెట్టాం. ఈ ఏడాది వెలిగొండ పై శ్రద్ధ పెట్టి ప్రజల జీవితాల్లో జలకళ తీసుకొస్తాం. హార్టికల్చర్ కు ఎక్కువ ప్రాధాన్య ఇస్తున్నాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నాం. సీమతో పాటు మార్కాపురం, ప్రకాశం జిల్లాలను ఉద్యాన పంటలతో అభివృద్ధి చేస్తాం. మార్కాపురాన్ని ఉద్యాన పంటలకు కేంద్రంగా తయారు చేసేందుకు ప్రజలు సహకరించాలి. రూ.1300 కోట్లు వ్యయంతో నల్లమల సాగర్ నుంచి ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందించే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**రూ.50 కోట్లతో జిల్లా కలెక్టరేట్ నిర్మిస్తాం**

ప్రజలకు హామీ ఇచ్చినట్టుగానే మార్కాపురాన్ని జిల్లాగా చేసి ఇక్కడి ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చాం. మార్కాపురం జిల్లాలో భూ రికార్డుల సమస్యలున్నాయి. మేము అధికారంలోకి వస్తూనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. గత పాలనలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు. అడిగిన భూములు ఇవ్వకపోతే 22ఏలో పెట్టారు. సర్వే రాళ్లపై వారి ఫోటోలు వేసుకున్నారు. మేము రాజముద్రతో పట్టదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. క్యూఆర్ కోడ్ తో భూమి రికార్డులు భద్రంగా తయారు చేయిస్తున్నాం. ఎవరైనా తప్పు రికార్డులు చేస్తే తాట తీస్తామని హెచ్చరిస్తున్నాను. మార్కాపురం జిల్లా నూతన కలెక్టరేట్ భవనానికి రూ. 50 కోట్లు మంజూరు చేస్తున్నాం. 20 నెలల పాలనలో రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. యువతకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటాం. అవినీతికి తావు లేకుండా మెగా డీఎస్సీ నిర్వహించాం. కానిస్టేబుళ్ల నియామకాలు పూర్తి చేశాం. వరద నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాలు పెంచుతాం. గోదావరి నుంచి 6000 టీఎంసీలు, కృష్ణా నుంచి 1500 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లింది. వెలిగొండ ప్రాజెక్టుకు కావాల్సింది కేవలం 53 టీఎంసీల నీరే. ఈ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఉంది. ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో సురక్షిత నీరు సరఫరా చేస్తాం. పరిశుభ్రమైన రాష్ట్రం కోసం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నాం. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీ4 కార్యక్రమం చేపట్టాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**2019-24 మధ్య రాష్ట్రానికి చీకటి రోజులు**

గత పాలకులు చేయని అపచారం లేదు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారు. కెమికల్స్ కలిపిన నెయ్యితో లడ్డూలు చేసి విక్రయించారు. ఆ నెపాన్ని హెరిటేజ్ పై మోపారు. ఆనాడు బాబాయ్ ని చంపేసి మరుసటి రోజు సాక్షి పత్రికలో నారా సుర రక్త చరిత్ర అని నా చేతిలో కత్తి పెట్టాడు. నోరు తెరిస్తే బూతులు మాట్లాడతారు. నా తల్లి, భార్య, మా పార్టీ నేతలను ఇష్టానుసారంగా దుర్భాషలాడారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రారు కానీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కావాలంటారు. వాళ్లు బెదిరిస్తే ఇవ్వాలా. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓట్లు వేస్తేనే ఏదైనా సాధ్యం అని కూడా వారికి తెలీదా? గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంస జరిగింది. ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడ్డారు. గంజాయి, భూ కబ్జాలు, దౌర్జన్యాలతో హడలిపోయారు. నేను ఎవరు తిట్టినా లెక్కపెట్టుకోను. నేను జీవిస్తోంది ప్రజలు, రాష్ట్రం కోసమే. నాకు కుల, మత విభేదాలు లేవు. తెలుగు జాతి అభ్యున్నతి నాకు ముఖ్యం. బడుగు, బలహీన వర్గాలను పైకి తీసుకొచ్చి అవకాశాలు కల్పిస్తాం. నేను ఆనాడు టెక్నాలజీని ప్రమోట్ చేశాను. మన దూరదృష్టి కారణంగా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ నుంచి వస్తోంది. గుజరాత్ రాష్ట్రంలో 25 ఏళ్లుగా ఒకే పార్టీ అధికారంలో ఉంది. మోదీ 3వ సారి ప్రధాని అయ్యారు. మరోసారి అవుతారు. ప్రజలు ఏది మంచి, ఏది చెడు అనేది ఆలోచన చేసి...కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమర్థులను గెలిపించాలని ముఖ్యమంత్రి కోరారు.

**స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కాలువ పనులు పరిశీలన**

వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ పనుల శంకుస్థాపన అనంతరం రైతులు వెంకటేశ్వరరెడ్డి, సురవరం గండి వీరారెడ్డిలతో సంభాషిస్తూ ఫీడర్ కెనాల్ పనుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. వెలిగొండ పూర్తి అయితే ఈ ప్రాంత భూగర్భజలాలు కూడా పెరుగుతాయని, బోర్లకు, చెరువులకు నీరు వస్తాయని ముఖ్యమంత్రికి రైతులు వివరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనులు, ఫీడర్ కాలువ పనులు వేగంగా చేపడుతున్నందుకు ముఖ్యమంత్రికి స్థానిక రైతులు ధన్యవాదాలు తెలిపారు. అరటి, బొప్పాయి లాంటి పంటల సాగు చేసేందుకు అనుకూల ప్రాంతమని, మీరే శంకుస్థాపన చేశారు, మీరే ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేస్తున్నారని సీఎంతో రైతులు అన్నారు. ప్రాజెక్టులో రూ.2500 కోట్ల విలువైన పనులు మిగిలి ఉన్నా వాటిని పూర్తి చేయకుండా జాతికి అంకింతం చేసినట్టు గత పాలకులు నాటకాలాడారని ముఖ్యమంత్రి అన్నారు.

**వెలిగొండ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష**

ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, పనులు జరుగుతున్న తీరుపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. 11,580 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా ఫీడర్ కాలువ పనులు చేపట్టామని జల వనరుల శాఖ అధికారులు వివరించారు. నల్లమల సాగర్ ప్రాంతంలో మూడు గ్యాప్స్ ఫిల్ చేసి రిజర్వాయర్ ఏర్పడిందని , తద్వారా 53.83 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. రోజుకు 200 మీటర్ల మేర కాలువ లైనింగ్ పనులు చేస్తున్నామని , 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల మేర సైడ్ వాల్ పనులు మే చివరి నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి తెలిపారు. ఫ్లడ్ సీజన్ ప్రారంభం అయ్యే సమయానికి ఫీడర్ కాలువ సిద్ధం అయిపోతుందని వెల్లడించారు.

## ఎడిటర్ వాయిస్

# పవన్ జిల్లా పర్యటన ముహూర్తం పెట్టేశారా..!

వాస్తవానికి ఈ ఏడాది జనవరి నుంచి జిల్లాల్లో పర్యటిస్తానని గత ఏడాది నిర్వహించిన పార్టీ ప్లీనరీలోనే పవన్ ప్రకటించారు. అటు పార్టీ పరంగా.. ఇటు ప్రజల పరంగా కూడా కార్యక్రమాలు పర్యవేక్షిస్తానని చెప్పారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్.. జిల్లాల పర్యటన మరోసారి వాయిదా పడింది. దీనిపై పార్టీ కార్యాలయ వర్గాలు అత్యంత విశ్వసనీయంగా చెబుతున్న సమాచారం మేరకు.. ఏప్రిల్ చివరి వరకు పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటన ఉండదని సమాచారం. వాస్తవానికి ఈ ఏడాది జనవరి నుంచి జిల్లాల్లో పర్యటిస్తానని గత ఏడాది నిర్వహించిన పార్టీ ప్లీనరీలోనే పవన్ ప్రకటించారు. అటు పార్టీ పరంగా.. ఇటు ప్రజల పరంగా కూడా కార్యక్రమాలు పర్యవేక్షిస్తానని చెప్పారు.

కానీ, ఈ పర్యటన వాయిదా పడింది. తాజా సమాచారం మేరకు.. ఏప్రిల్ చివరి వారంలో పవన్ కల్యాణ్ జిల్లాల పర్యటన ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. కేవలం జిల్లాల్లోనే కాకుండా.. గ్రామాల్లోనూ పవన్ పర్యటించనున్నారు. అయితే..ఈ వాయిదా వెనుక అభివృద్ధి కార్యక్రమాలే కారణంగా ఉన్నాయని పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రస్తుతం పంచాయతీ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలలో మౌలిక సదుపా యాల పనులు జరుగుతున్నాయి.

ముఖ్యంగా రహదారుల నిర్మాణం జోరుగా సాగుతోంది. వీటిని పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు న్నారు. అంతేకాదు.. స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే ప్రయత్నం కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న పనులకు.. తన పర్యటనతో విఘాతం కలుగుతుం దని పవన్ కల్యాణ్ అంచనా వేస్తున్నారు. అందుకే.. వాయిదా వేసుకున్నట్టు తెలుస్తోంది. దీనికితోడు.. ఏప్రిల్ మొదటి వారంలో ఎలాగూ.. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ రానుంది. ఈ నేపథ్యంలో అప్పుడు ఒకేసారి పర్యటనలు చేస్తే బెటర్ అన్న ఆలోచన ఉంది.

మరోవైపు.. పార్టీలో ప్రస్తుతం సభ్యత్వ కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. నాయకులు నెమ్మదిగా కదులుతున్నారు. వచ్చే నెల నాటికి సభ్యత్వ కార్యక్రమం మరింత జోరుగా జరుగుతుందని లెక్కలు వేసుకున్నారు. ఈ క్రమంలో మార్చిలో పర్యటన పెట్టుకుంటే.. సభ్యత్వ నమోదు కార్యక్రమానికి కూడా ఆటంకం కలిగే అవకాశం ఉందని అంచనా వేసుకుంటున్న పవన్ కల్యాణ్.. ఏప్రిల్ చివరి వారం అయితే.. అందరికీ బాగుం టుందని భావిస్తున్నట్టు జనసేన కేంద్ర కార్యాలయ వర్గాలు తెలిపాయి.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

## క్రైం వాయిస్

## తండ్రిని కాల్చి చంపిన తనయుడు

**మృతదేహం ముక్కలు చేసి డ్రమ్ములో దాచిపెట్టాడు - ఎవరికైనా చెబితే అంతు చూస్తానని చెల్లికి హెచ్చరిక**



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని నగరమైన లఖ్‌నవూలో ఓ యువకుడు తండ్రిని తుపాకీతో కాల్చిచంపి, మర్నాడు తానే పోలీస్‌స్టేషనుకు వెళ్లి మిస్సింగ్ కేసు పెట్టిన వైనమిది. పోలీసుల కథనం ప్రకారం.. మానవేంద్ర సింగ్ (50)కు నగరంలో పాథాలజీ ల్యాబులు, మద్యం దుకాణాల వ్యాపారం ఉంది. ఈయన భార్య తొమ్మిదేళ్ల క్రితం మరణించారు. ఆర్థికంగా ఏ లోటు లేకున్నా కుమారుడిని డాక్టరుగా చూడాలన్నది ఆయన కల. ఇంటర్‌లో బైపీసీ చదివి మంచి మార్కులు తెచ్చుకొన్న కుమారుడు అక్షత్ ప్రతాప్ (19) ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాడు. నీట్ పరీక్ష రాయాలని తండ్రి అతడిపై తరచూ ఒత్తిడి తెచ్చేవాడు. కుటుంబ వ్యాపారాలు చూసుకుంటే చాలంటూ అక్షత్ తండ్రితో గొడవ పడేవాడు. ఈ నెల 20న ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. విచక్షణ కోల్పోయిన అక్షత్ ఇంట్లోని లైసెన్స్‌డ్ తుపాకీతో తండ్రిని కాల్చి చంపాడు. ఆ శబ్దానికి తన గదిలో నుంచి పరుగున వచ్చిన చెల్లెలి (16)ని ఈ విషయం బయట చెబితే అంతు చూస్తానని అక్షత్ బెదిరించి నోరు మూయించాడు. మృతదేహాన్ని మూడో అంతస్తు నుంచి కిందికి తీసుకువచ్చి.. రంపంతో ముక్కలుగా కోసి డ్రమ్ములో కుక్కాడు. కొన్ని శరీర భాగాలను కారులో మారుమూల ప్రాంతానికి తీసుకువెళ్లి విసిరేశాడు. మర్నాడు పోలీసుల వద్దకు వెళ్లి.. దిల్లీకి వెళ్లిన తన తండ్రి జాడ తెలియడం లేదని, ఫోను స్విచ్ఛాఫ్ వస్తోందని మిస్సింగ్ కేసు పెట్టాడు. ఈ క్రమంలో స్థానికులు కొందరు ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పోలీసులు మానవేంద్ర ఇంటిని తనిఖీ చేయగా.. గుట్టంతా బయటపడింది. డ్రమ్ములోని శరీర భాగాలను స్వాధీనం చేసుకొని, అక్షత్‌ను అరెస్టు చేసినట్లు డీసీపీ విక్రాంత్ వీర్ తెలిపారు.

## ప్రేమ విఫలమై.. యూట్యూబర్ కోమలి ఆత్మహత్య



**రాయదుర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రేమ విఫలమై యూట్యూబర్ కోమలి (21) ఆత్మహత్యకు పాల్పడింది. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్టణానికి చెందిన కోమలి.. హైదరాబాద్‌లో బీఎస్సీ చదువుతోంది. మణికొండలోని చిత్రపురి కాలనీ ఎల్‌ఐజీలో బంధువుల వద్ద ఉంటోంది. విశాఖపట్నానికే చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, యూట్యూబర్ నిఖిల్ రెడ్డిని ఆమె ప్రేమిస్తోంది. కోమలి నుంచి దూరంగా ఉండేందుకు నిఖిల్ ప్రయత్నిస్తుండటంతో ఆరు నెలల క్రితం ఆమె ఆత్మహత్యకు యత్నించగా.. బంధువులు సర్దిచెప్పారు. ఇటీవల పెళ్లి విషయంలో కోమలి, నిఖిల్‌రెడ్డి గొడవపడ్డారు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో కోమలి ఉరివేసుకుంది. ఆమె తల్లి మంగళవారం రాయదుర్గం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బాలికలపై అత్యాచారం.. జ్యోతిష్కుడికి 200 ఏళ్ల జైలుశిక్ష



**చెన్నై, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇద్దరు బాలికలపై అత్యాచారానికి పాల్పడిన కేసులో జ్యోతిష్కుడికి 200 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ తమిళనాడులోని శివగంగై పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. 2021 నవంబరులో ఓ మహిళ తన 14, 17 ఏళ్ల వయసున్న కుమార్తెలు సరిగా చదవడం లేదని శివగంగై జిల్లా కారైక్కుడికి చెందిన జ్యోతిష్కుడు రామకృష్ణన్(52) వద్దకు తీసుకెళ్లారు. వారికి పరిహారం చేయాలని మహిళకు చెప్పి, ఆమె ఇద్దరు కుమార్తెలను ఓ గదిలోకి తీసుకెళ్లి నిందితుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. కొద్దిరోజులకు ఇద్దరూ అనారోగ్యానికి గురవడంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు వారికి లైంగిక సంక్రమణ వ్యాధి సోకినట్లు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు కుమార్తెలను గట్టిగా అడగ్గా.. జ్యోతిష్కుడు అత్యాచారం చేసినట్లు చెప్పారు. అనంతరం తల్లి ఫిర్యాదు మేరకు తిరుప్పత్తూర్ ఆల్ ఉమెన్ పోలీసులు దర్యాప్తు చేపట్టి రామకృష్ణన్‌ని అరెస్టుచేశారు. ఈ కేసు విచారణ శివగంగై పోక్సో కోర్టులో సోమవారం ముగిసింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి 200 ఏళ్ల జైలు శిక్ష, రూ.2లక్షల జరిమానాతో పాటు బాధితులకు రూ.10లక్షల చొప్పున ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని జడ్జి ఉత్తర్వులు జారీచేశారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య

**బాసర, విశ్వం వాయిస్ న్యూస్ :** నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బాలికల హాస్టల్‌లో బలవన్మరణానికి పాల్పడినట్లు సిబ్బంది గుర్తించారు. ఆమెది వనపర్తి జిల్లా. కుటుంబసభ్యులకు కళాశాల సిబ్బంది సమాచారం అందించారు. మృతదేహాన్ని భైంసా ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## భార్య, ముగ్గురు పిల్లల గొంతు కోసి..

**విశ్వం వాయిస్ న్యూస్ :** దిల్లీలో దారుణ ఘటన వెలుగుచూసింది. ఓ తల్లీ, ఆమె ముగ్గురు కుమార్తెలు హత్యకు గురయ్యారు. ఈ ఘటనకు పాల్పడింది మృతురాలి భర్తేనని పోలీసులు అనుమానిస్తున్నారు. దిల్లీలోని సిరాస్‌పుర్ గ్రామానికి చెందిన ఓ మహిళ తన భర్త మున్‌చన్ కెవాత్, ముగ్గురు కుమార్తెలతో కలిసి చందన్‌పార్క్ ఏరియాలో నివాసం ఉంటున్నారు. కెవాత్ ఆజాద్‌పుర్ మండిలో కూరగాయలు విక్రయిస్తుంటాడు. బుధవారం ఉదయం మహిళ, 3,4,5 ఏళ్లున్న ఆమె ముగ్గురు చిన్నారులు ఇంట్లోని నేలపై రక్తపుమడుగుల్లో పడి ఉండటాన్ని స్థానికులు చూసి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. హంతకుడు పదునైన ఆయుధంతో గొంతు కోసి.. హత్య చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. బాధితులంతా నిద్రలో ఉండగానే ఈ దాడి జరిగిందని ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఘటన జరిగినప్పటి నుంచి మహిళ భర్త పరారీలో ఉన్నాడని.. అతడిని సంప్రదించేందుకు ప్రయత్నించినా అది సాధ్యపడలేదని తెలిపారు. ఈ క్రమంలో అతడే ఈ దారుణానికి పాల్పడిఉంటాడని పోలీసులు అనుమాని స్తున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టానికి ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామన్నారు. కెవాత్ ఆచూకీ కోసం అతడి సన్నిహితులను ప్రశ్నిస్తున్నామని.. దగ్గరలోని సీసీటీవీ దృశ్యాలను కూడా పరిశీలిస్తోన్నట్లు వివరించారు.

## మచిలీపట్నంలో పట్టపగలే భారీ చోరీ..

**అరకిలో బంగారం అపహరణ**



**మచిలీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పట్టపగలే భారీ చోరీ చోటుచేసుకుంది. చిలకలపూడి సర్కార్ తోట ప్రాంతంలో ఓ ఉపాధ్యాయురాలి ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకుంది. గుడ్లవల్లేరు మండలం కౌతరం ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మార్గరెట్ బుధవారం ఉదయం తన ఇంటికి తాళాలు వేసుకొని పాఠశాలకు వెళ్లారు. రంజాన్ మాసం కావడంతో పాఠశాలకు మధ్యాహ్నం సెలవు ప్రకటించడంతో ఆమె ఇంటికి వచ్చారు. తలుపులు పగలగొట్టి ఉండటంతో ఇంట్లో చోరీ జరిగిందని నిర్ధరించుకుని.. చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీంతో ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. దాదాపు 50 తులాల బంగారం, రూ.1,40,000 నగదు చోరీ జరిగినట్లు బాధితురాలు తెలిపారు.

## యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. గతేడాది నమోదైన కేసులో పంజాగుట్ట పోలీసులు ఈ నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియాలో ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని కరాటే కల్యాణి ఫిర్యాదు చేశారు. దీంతో అప్పట్లో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాజాగా లుకౌట్ నోటీసులు జారీ చేశారు. విశాఖకు చెందిన అన్వేష్ విదేశాల్లో ఉంటూ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అసభ్యంగా అతడు వీడియో విడుదల చేసిన సంగతి తెలిసిందే.

## లండన్‌లో తెలుగు యువకుడి మృతి

**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** లండన్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తెలుగు యువకుడు మృతిచెందాడు. కాకినాడ జిల్లా పెద్దాపురం పరిధిలోని కొండయ్యపేటకు చెందిన గొంతి అభిషేక్ (28) మృతిచెందినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. ఎంబీఏ చేసేందుకు మూడేళ్ల క్రితం లండన్ వెళ్లిన అభిషేక్.. చదువు అనంతరం అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు. ఆరు నెలల క్రితం స్వస్థలానికి వచ్చి తిరిగి వెళ్లాడు. అభిషేక్ తండ్రి ఆస్కారరావు ఆగిరిపల్లి పీహెచ్‌సీలో సీహెచ్‌వోగా పనిచేస్తున్నారు.

## కిసాన్ వాయిస్

# పదండి.. పార్ట్‌టైమ్ వ్యవసాయానికి..



**పొలం కొనక్కర్లేదు..**
**సాగు పద్ధతులు తెలియవన్న చింతాలేదు..**
**నష్టం వస్తుందేమోనన్న బెంగా లేదు... నెలకు, చదరపు అడుగుకు ఇంత... అని అద్దె చెల్లిస్తే చాలు..**
**పొలం మీ సొంతమవుతుంది!!.**

**కావాల్సిన పంటలు పండించుకోవచ్చు.**
**దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ లాంటి**
**నగరాల్లో ఉండేవాళ్లు ఇప్పటికే**
**ఈ అవకాశాన్ని సద్వినియోగం**
**చేసుకుంటున్నారు!!**

రమేశ్, లత దంపతులు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. చెరో కంపెనీలో వేర్వేరు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. ఫ్రెండ్ సలహాతో నగరానికి 30కి.మీ. దూరంలో ఉన్న పొలంలో వెయ్యి చదరపు అడుగుల స్థలాన్ని అద్దెకు తీసుకుని, కూరగాయలు పండిస్తున్నారు. ఆదివారం పొద్దున్నే కారులో భార్యాభర్తలిద్దరూ పొలానికి వెళ్లి, కలుపు తీయడం, ఎరువులు వేయడం, నీళ్లు పెట్టడం లాంటి పనులు చేస్తారు. ఇటువంటి జంటలు ఇప్పుడు వందల్లో ఉన్నాయి.

**అద్దెకు పొలం**

దాదాపు పదేళ్ల క్రితం బెంగళూరులో 'స్వయంకృషి' పేరుతో ఇలా పొలాన్ని అద్దెకిచ్చే విధానాన్ని ప్రారంభించారు ఎం.సునీల్ కుమార్. ఎం.ఎస్సీ. చదివి కొంతకాలం కార్పొరేట్ ఉద్యోగం చేశాక మానేసి వ్యవసాయం వైపు మళ్లిన సునీల్ మొదట్లో చదరపు అడుగు రెండు రూపాయలకు అద్దెకిచ్చేవాడు. ఇప్పుడది మూడున్నర అయింది. నాలుగు నెలలనుంచి ఏడాది వరకూ ఎన్ని నెలలైనా, ఎన్ని అడుగులైనా అద్దెకు తీసుకోవచ్చు. అలాంటిదే మరో సంస్థ ఫార్మిజెన్. షమీక్ చక్రవర్తి బెంగళూరులోనే ఒక కంపెనీలో డైరెక్టర్‌గా పనిచేసేవాడు. బయట ఆర్గానిక్ అనిచెప్పి అమ్ముతున్నవన్నీ సేంద్రియ ఉత్పత్తులే కాదని అర్థమై మిద్దె మీద పండించుకుందామనుకున్నారు. అక్కడ స్థలం సరిపోక, శివార్లలో ఒక రైతు దగ్గర 600 గజాల స్థలం లీజుకు తీసుకుని సాగు మొదలుపెట్టారు. రోజూ నీరు పెట్టే పని రైతు చూసుకోవాలనీ, వారాంతాల్లో తాము వస్తామని ఒప్పందం చేసుకున్నారు. అలా వెళ్లడానికి వీలుకానప్పుడు పంట చెడిపోయేది. ఏం చేయాలా అని ఆలోచిస్తున్నప్పుడు వచ్చింది 'మినీ ఫార్మ్' ఐడియా. చక్రవర్తి భార్య గీతాంజలి, మరో స్నేహితుడు బాలసుబ్రహ్మణ్యంతో కలిసి 'ఫార్మిజెన్' స్టార్టప్‌ని ప్రారంభించారు. ఈ సంస్థ ఇప్పుడు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై చుట్టుపక్కల మినీ ఫార్మ్‌ని నిర్వహిస్తోంది. పార్ట్ టైమ్ రైతు అవతారం ఎత్తాలనుకునేవాళ్లు ఫార్మిజెన్ యాప్ డౌన్లోడ్ చేసుకుని సబ్‌స్క్రైబర్లుగా మారొచ్చు. 600 చ.అడుగుల పొలాన్ని అద్దెకు తీసుకుని నచ్చిన పంటలు పండించుకోవచ్చు. ఎడిబుల్ రూట్స్, గ్రీన్‌లీఫ్ ఇండియా, ఆర్గానిక్ మాటి, కోసర ఫార్మ్స్... ఇలాంటి ఎన్నో సంస్థలు దేశవ్యాప్తంగా నగరాల శివారు గ్రామాల్లో చదరపు అడుగుల లెక్కన పొలాన్ని అద్దెకు ఇస్తున్నాయి. పెట్టుబడి తదితర ఖర్చులన్నీ సంస్థలే భరిస్తాయి. సాగు పని అంతా కూడా రైతులే చేస్తారు. అద్దెకు తీసుకున్న వాళ్లు వారాంతాల్లో వెళ్లి ఆసక్తి మేరకు అందులో భాగస్వాములు కావచ్చు. ఒకవేళ పనుల ఒత్తిడిలో వెళ్లడం వీలుకాకపోయినా పంటకు ఢోకా లేదు. సంస్థ సిబ్బందే అన్నీ చూసుకుంటారు. యాప్ ద్వారా పంట ఎదుగుదల వివరాలను అద్దె యజమానికి తెలియజేస్తూ ఉంటారు.

**లాభాలెన్నో!**

సొంత పొలమూ పెద్ద మొత్తంలో పెట్టుబడి లాంటివి లేకుండా సాగు అనుభవం సొంతమవుతుంది.

ఉద్యోగం చేసుకుంటూనే ఈ పని చేయవచ్చు.

పొలాలమధ్య ప్రశాంత వాతావరణంలో గడపడం వల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది.

క్రిమిసంహారకాలు, రసాయన ఎరువులు వాడకుండా తమ చేతులతో పండించిన కూరగాయలు తింటున్నామన్న తృప్తి ఉంటుంది.

నగరాల్లో పుట్టి పెరుగుతున్న పిల్లలకు వ్యవసాయానికి సంబంధించిన పనుల పట్ల అవగాహన కలుగుతుంది.

మట్టి, నీరు, వాతావరణం... వీటన్నిటికీ మనిషి కష్టం తోడైతేనే టేబుల్ మీదికి భోజనం వస్తుందని అర్థమవుతుంది.

కష్టపడి పండించుకున్న పంట కాబట్టి సహజంగానే ఆహార వృథా తగ్గుతుంది.

వేర్వేరు పంటల్ని సేంద్రియ విధానంలో పండించడం వల్ల నేల సారవంతంగా ఉంటుంది.

అద్దె రైతుల బృందాలను ఏర్పాటుచేసి సాగులో మెలకువలు నేర్పడం, ఉత్పత్తుల నిల్వకు కోల్డ్‌స్టోరేజి ఏర్పాటు, వారంలో ఒకరోజు సంత నిర్వహించి దిగుబడులను నేరుగా విక్రయించడం... ఇలాంటి ఎన్నో పనులను ఈ సంస్థలు నిర్వహిస్తున్నాయి. ఆలస్యం దేనికి? మీకు దగ్గరలో పొలాన్ని అద్దెకిచ్చే సంస్థలు ఏమున్నాయో వెతకండి మరి!

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

గురువారం, 26 ఫిబ్రవరి 2026




www.viswamvoice.com

### పాల కల్తీ విషయంలో

## మా ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉంది

**బాధితులకు మెరుగైన వైద్యం అందుతోంది - ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల ఆరోగ్యం... ప్రాణాల విషయంలో ఎవరైనా తప్పులు చేస్తే... చూస్తూ ఊరుకోము... ఉపేక్షించబోమని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు రోజులుగా నగరంలో పాల కల్తీ వ్యవహారంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. 300కు పైగా శాంపిల్స్ తీసుకుని ఎవరు ఈ పాల కల్తీకి గురయ్యారో గుర్తించడం జరిగిందన్నారు. ప్రతిరోజూ ప్రభావిత ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రత్యేక శిబిరాలను నిర్వహించి నిపుణుల పర్యవేక్షణలో శాంపిల్స్ తీసుకుని పరీక్షిస్తున్నార న్నారు. రెయిన్ బో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు పిల్లల పరిస్థితి మెరుగుపడిందన్నారు. వైద్య పరంగా ఎక్కడా వెనక్కు తగ్గవద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీచేశారని తెలిపారు. డెల్టా ఆసుపత్రిలో ఒకరు ఇంకా వెంటిలేటర్పై ఉన్నారని, కిమ్స్ లో 8 మందిలో నలుగురి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందన్నారు. చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్య సదుపాయాలందించేందుకు హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ నుండి ఎక్విప్మెంట్ తీసుకువచ్చారన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని నిన్ననే అందించామన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి సంబంధించి పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుం దన్నారు. ఈ పాల కల్తీకి సంబంధించి నిందితుడిని రిమాండ్ కి తరలించడం జరిగిందని తెలిపారు. తాజా ఘటనతో రాజమహేంద్రవరంలో టెస్టింగ్ ల్యాబ్ను పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పటికీ అక్కడికి వెళ్లకుండా స్థానికంగా ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నామ న్నారు. పాల కల్తీ వ్యవహారం వెలుగులోకి రాగానే ప్రభుత్వ యంత్రాంగం సరైన విధంగా స్పందించక పోవడంతోనే జీజీహెచ్ సూపరింటెండెంట్పై వేటు వేయడం జరిగిందన్నారు. ఒక పక్క శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్లు ఎప్పటికప్పుడు స్థానికంగా పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలిచే విషయంలో ఏమాత్రం అశ్రద్ధ వహించరాదని సూచించినట్టు తెలిపారు. కాగా నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి ని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

### కల్తీ పాలు రోగులకు

## మెరుగైన వైద్యానికి ప్రభుత్వం చర్యలు

**సంఘటనపై ప్రజలను భయాందోళనకు గురి చేయడం వైసిపికి తగదు**
**ఏపీటీఎస్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్ పర్సన్ డాక్టర్ ఖండవల్లి లక్ష్మి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగర శివారు ప్రాంతాల్లో కల్తీ పాలు బారిన పడి తీవ్ర అనారోగ్యం పాలైన బాధిత రోగులకు మెరుగైన ఆధునిక వైద్యంతో పాటు అన్ని రకాల చర్యలను వేగవంతంగా అందించే విధంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని రకాలుగా వేగంగా చర్యలు తీసుకుంటున్నారని ఆంధ్ర తెలంగాణ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఆఫ్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్ పర్సన్ డాక్టర్ ఖండవల్లి లక్ష్మి అన్నారు. స్థానిక బొల్లినేని(కిమ్స్ ) హాస్పిటల్ లో వైద్యం పొందుతున్న కల్తీ పాలు బారిన పడిన బాధిత రోగులను మంగళవారం మానవ హక్కుల సంఘం తరఫున హాస్పిటల్ కు వెళ్లి పరామ ర్శించారు. అనంతరం హాస్పిటల్ వెలుపల ఆమె మీడియాతో మాట్లాడుతూ, కల్తీ పాలు వినియో గించిన కుటుంబాల్లో ఎనిమిది మంది బాధితులకు బొల్లినేని హాస్పిటల్ లో డయాలసిస్ జరుగుతుందన్నారు. సంఘటన చోటు చేసుకున్న వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో పాటు రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జిల్లా కలెక్టర్ కీర్తిచేకూరి, ఇతర ఉన్నత అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి బాధితులకు మెరుగైన వైద్యం అందించే చర్యలు తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో జరిగే లోపాలకు ప్రభుత్వంపై నింద వేయడం, విచారకర సంఘటనతో రాజకీయాలు చేయడం వైసిపి పార్టీకి తగదన్నారు. ఈ సంఘటన లో ఐదుగురు మృతి చెందడం విచారకరమని, మిగతా వారి ఆరోగ్య స్థితి మెరుగుపరిచేందుకు అన్ని విధాల చర్యలు సత్వరం తీసుకుంటు న్నామన్నారు. కల్తీ పాలు సరఫరా చేసిన వ్యాపారిని అరెస్టు చేశామని, మృతి చెందిన కుటుంబాలకు రూ. 10 లక్షల నష్టపరిహారం వెంటనే ప్రభుత్వం చెల్లించిందని, వైద్యం పొందుతున్న వారికి ప్రభుత్వమే మెరుగైన వైద్యంతో పాటు వైద్య ఖర్చులు భరిస్తుందని, ఆహార భద్రత , తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. కల్తీ పాలు సంఘటనలో నిజానిజాలు తేలిన తర్వాత నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అంతవరకు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం మానుకోవాలని హితవు పలికారు.

## శ్యామలాంబ అమ్మవారి ఉగాది జాతర మహోత్సవాలకు రాట ముహూర్తం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గీత అప్సర దియేటర్ సమీపంలో ఉన్న శ్రీశ్రీశ్రీ శ్యామ లాంబ అమ్మవారి ఉగాది జాతర మహోత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం పందిరి వేసేందుకు రాట ముహూర్తం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి జోగి వెంకటేశ్వరరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కడియాల వీరభద్రరావు, సభ్యులు రాట ముహూర్తం కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వీరభద్రరావు మాట్లాడుతూ అత్యంత వైభవంగా శ్యామలంబ అమ్మవారి ఉగాది జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటిఅసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఐవివి సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులు అల్లాడ వెంకట సత్య అప్పారావు, బోను ఈశ్వరి, మల్లపరెడ్డి వరలక్ష్మి, తాడివలస వెంకటలక్ష్మి, తొర్లపాటి శాలిని, అండూరి చంద్రశేఖర్, కారుమూరి సురేష్, కెల్లా జయలక్ష్మి, మాదిరెడ్డి పద్మావతి (ఎక్స్ అఫీషియో) హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, రాష్ట్ర శెట్టిబలిజ



కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు దొండపాటి సత్యంబాబు,రుంకాని విజయ్, బిజెపి నాయకులు కమలేష్ జైన్ తదితరులు పాల్గొని పూజలు చేసారు.

## రోడ్ల మీద వ్యర్థాలు వేస్తే జరిమానా

**జీవీపీలు ఉంచొద్దు : కమిషనర్ రాహుల్ మీనా**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బహిరంగ ప్రదేశాలు, రోడ్ల వెంట వ్యర్థ పదార్థాలను వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. బుధవారం ఉదయం ప్రకాష్ నగర్లో ఆయన పర్యటించి.. పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. లేడీస్ క్లబ్ వీధిలోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్(జీవీపీ) ను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త వేయకుండా బోర్డు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సిబ్బందికి సూచించారు. బాధ్యత లేకుండా రోడ్లపై చెత్తను పారవేసే వారితోపాటు దుకాణాల వద్ద డస్ట్ బిన్‌లు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వ్యాపారులకు జరిమానాలు విధించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతిఒక్కరి బాధ్యత అని.. నగరపాలక సంస్థ చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాలకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట శానిటరీ సూపర్ వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

## వైఎస్ షర్మిల చేపట్టిన ఉపాధి పరిరక్షణ యాత్రను విజయవంతం చేయండి



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిళ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఉపాధి పరిరక్షణ యాత్రను విజయవంతం చేయండి అని నిడదవోలు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ మేడవరపు బద్రందొర వారి ఆధ్వర్యంలో నిడదవోలు మండలంలో కలవచర్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ఈ పదకం గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేసారు. అనంతరం బద్రందొర మాట్లాడుతూ గత 2005లో అప్పటి యు.పి.ఐ కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జీవనోపాధి లేక ప్రజలు వలసలు వెళ్తుంటే వారికి పని కల్పించాలని ప్రవేశపెట్టిన మోహోత్తర పథకం అటువంటి పథకాన్ని నిర్మూలించాలి అనే కుట్రతో కేంద్ర ప్రభుత్వం చెల్లించవలసిన 90 శాతం నిధులను 60 శాతం మాత్రమే చెల్లిస్తామని చెప్పడం పథకానికి తూట్లు పొడవటమే అంతేకాకుండా మహాత్మాగాంధీ పేరుతో ఉన్న పదకానికి రాంజి అని పెట్టడం మహాత్మాగాంధీని అవమానించడమే మహాత్మాగాంధీ ని బౌతికంగా గాడ్సే హత్య చేస్తే మానసికంగా బిజెపి వాళ్ళు హత్యచేస్తున్నట్లు అని అన్నారు. ఈ పదకాన్ని యధావిధిగా కొనసాగించాలని రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిళ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూన్న ఈ యాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిన్నం మురళీ కృష్ణ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ బషీర్, జిల్లా ఎస్.టి. విభాగం అధ్యక్షులు బండి అభిశక్తుడు పాల్గొన్నారు.

### అన్నా క్యాంటీన్‌ను

## ఆకస్మిక తనిఖీ చేసిన కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నా క్యాంటీన్ల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండకూడదని, సమయపాలన కచ్చితంగా పాటించాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. బుధవారం జీజీహెచ్ సమీపంలోని అన్నా క్యాంటీన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అల్పాహారం తీసుకుంటున్న ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి.. క్యాంటీన్ సమయానికి తెరుస్తున్నారా..? ఆహార పదార్థాల నాణ్యత ఎలా ఉంది..? ఏమైనా ఫిర్యాదులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ అభిప్రాయాలుక్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలియజేయవచ్చన్నారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడుతూ.. రోజుకు ఎంతమంది క్యాంటీన్ కు వస్తారో ఆరా తీశారు. ప్రజలకు సకాలంలో నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని.. క్యాంటీన్ పరిసరాల్లో అపరిశుభ్రత అనేది మచ్చుకైనా కనిపించకూడదన్నారు. ఆర్వో వాటర్ ఫిల్టర్ ను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ఉండాలని.. వేడి నీళ్లలోనే పాత్రలు, ప్లేట్లు కడగాలన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు. అలాగే ప్రతిరోజూ అన్న క్యాంటీన్లను పరిశీలించి, ఏ మరమ్మతులు ఉన్నా వెంటనే చేయించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ సూపర్ వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, ఇతర సిబ్బంది ఉన్నారు.

## 4న ఛలో విజయవాడ విజయవంతం చేయాలి

**ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకుల పిలుపు**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హులైన జర్నలిస్టులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి 4న చలో విజయవాడ కార్యక్రమంలో ప్రతి జర్నలిస్టు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కోశాధికారి మట్టపర్తి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అమలాపురం కాటన్ గెస్ట్ హౌస్‌లో ఏపీడబ్ల్యూజేఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఉద్దేశంతో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా జర్నలిస్టులుగా పనిచేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఇల్లు, ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వాలు హామీలు ఇస్తున్న వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఎన్నికల ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి జర్నలిస్టుకు మూడు సెంట్లు ఇళ్ల స్థలం కేటాయించడంతోపాటు ఇల్లు కూడా మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కోసం మీడియా వృత్తిఖకమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వృద్ధాప్యంలో ఉన్న జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. చలో విజయవాడ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బంగారు రాజు, కడలి రాజు, సామంతుల హరి, పివి రావు, పళ్ళ సూర్యప్రకాశరావు, మట్టపర్తి శ్రీనివాస్, కడలి సూరిబాబు, పరమట భీమహేష్, గుబ్బల భీమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో దింపు కార్మికుడు మృతి



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నందంపూడిలో దింపు తీయడానికి కొబ్బరి చెట్టు ఎక్కుతుండగా విద్యుత్ షాక్ తగిలి దింపు కార్మికుడు నేదునూరి జనార్దనరావు (60)చెట్టుపైనే మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది.ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బాధితుడు అన్నయ్య కుమారుడైన మురళీకృష్ణ ఫిర్యాదు .. మేరకు అంబాజీపేట పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.



### ఐ.పోలవరం పోలీస్ స్టేషన్‌లో

# ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ వార్షిక తనిఖీ





**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

ఐ పోలవరం పోలీస్ స్టేషన్‌లో ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్ ఐపీఎస్ వార్షిక తనిఖీ నిర్వహించారు. ఏలూరు రేంజ్ ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్ ఐపీఎస్ నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించి ఐ పోలవరం పోలీస్ స్టేషన్‌ను వార్షికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి, నిందితులకు శిక్షలు పడేలా దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠినంగా కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు భద్రతపై విశ్వాసం కల్పించేందుకు నిరంతరం గస్తీ నిర్వహించాలని, బాధితులతో మర్యాదగా మెలగాలని సిబ్బందికి సూచించారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఎలాంటి సమాచారాన్ని అయినా పంచుకునే ముందు నిజానిజాలు నిర్ధారించుకోవాలని కోరారు. సైబర్ నేరాలు, మహిళా రక్షణ చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. యానం ప్రాంతం నుంచి వచ్చే అక్రమ మద్యం, చమురు రవాణాను కట్టడి చేయాలని, సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచి ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వార్షిక తనిఖీ అనంతరం ఐజీ జి.వి.జి. అశోక్ కుమార్ ఐపీఎస్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ప్రముఖ పుణ్యక్షేత్రమైన మురమళ్ళ శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి దేవస్థానంను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్, అమలాపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, ఎస్బీసీఐ వి.పుల్లారావు, ముమ్మిడివరం సర్కిల్ ఇన్స్పెక్టర్ మోహన్ కుమార్, ఐ.పోలవరం ఎస్సై రవీంద్ర బాబు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### కోనసీమ తిరుమల వాడపల్లి వెంకన్న దేవస్థానంలో

# సీల్డ్ టెండర్ల ద్వారా వేలం పాటల నిర్వహణ

## గణనీయంగా పెరిగిన ఆలయ ఆదాయం



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో పలు హక్కులకు సంబంధించి బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు, ఈ-టెండర్లు బుధవారం నిర్వహించారు. నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సభ్యుల సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించగా లక్ష్మీ పోలవరం గ్రూప్ దేవాలయాల కార్యనిర్వహణాధికారి బి.కిరణ్ తనిఖీదారుగా వ్యవహరించారు. దేవస్థానానికి సంబంధించిన పార్కింగ్, బియ్యం, తలనీలాలు, షాపులు, పట్టు కండువాలు, సెక్యూరిటీ సప్లై తదితర హక్కులపై టెండర్లు ఆహ్వానించగా గత సంవత్సరంతో పోలిస్తే దేవస్థానానికి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు డీసీ చక్రధరరావు తెలిపారు. స్వామివారికి సమర్పించిన బియ్యాన్ని పోగు చేసుకుని తీసుకువెళ్లే హక్కును సంవత్సరం కాలానికి వాడపల్లి గ్రామానికి చెందిన సఖినాల వెంకటరావు రూ. 81,63,309 కు దక్కించుకున్నారు. గతంలో ఈ హక్కు ద్వారా రూ.51,11,830 మాత్రమే లభించగా, ఈసారి రూ.30,51,479 అధికంగా ఆదాయం వచ్చింది. అలాగే తలనీలాలను ప్రోగు చేసుకుని తీసుకువెళ్లే హక్కును ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన యాదగిరి ఎంటర్ప్రైజెస్ (కె.రాజు) రూ.20,07,000 కు దక్కించుకున్నారు. గత ఏడాది రూ.7,70,777 మాత్రమే రాగా, ఈసారి రూ.12,36,223 అధిక ఆదాయం నమోదైంది. స్వామివారి సేవలు, కళ్యాణోత్సవాల్లో ఉపయోగించే పట్టు కండువాల సరఫరా హక్కును విజయనగరానికి చెందిన విజయకుమార్ వస్త్రాలయం వారు సంవత్సర కాలానికి కండువా ఒక్కింటికి రూ.69 చొప్పున సరఫరా చేయుటకు టెండర్ ద్వారా హక్కు పొందారు. దేవస్థాన అవసరాల కోసం సెక్యూరిటీ సప్లై హక్కును రాజమండ్రికి చెందిన సారిక సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ దక్కించుకుంది. పార్కింగ్ ప్రదేశంలో ఏర్పాటు చేయనున్న 20 షాపులకు బహిరంగ వేలం నిర్వహించగా, కేవలం రెండు షాపులకు మాత్రమే టెండర్లు దాఖలయ్యాయి. పార్కింగ్ టెండర్ కు సంబంధించి బహిరంగ, బాక్స్ టెండర్లలో ఎవరూ పాల్గొనకపోవడంతో ఆ వేలాన్ని వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు మనకపల్లి త్రిమూర్తులు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### దక్షిణాసియాలోనే అతిపెద్ద ట్రావెల్ ఎక్స్‌పో 'SATTE'లో

# మెరిసిన ఏపీ పర్యాటక రంగం

## ఢిల్లీ 'యశోభూమి'లో ఏపీ టూరిజం స్టాళ్లకు విశేష స్పందన - జాతీయ, అంతర్జాతీయ టూర్ ఆపరేటర్లతో ఏపీ ప్రతినిధుల బృందం భేటీ

## రాష్ట్ర పర్యాటక రంగానికి గ్లోబల్ బ్రాండింగ్ కల్పించడమే లక్ష్యం




**అమరావతి/న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో న్యూఢిల్లీలోని 'యశోభూమి'లో ఫిబ్రవరి 25 నుండి 27 వరకు జరుగుతున్న దక్షిణాసియాలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్ 'SATTE' (సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్)లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రతినిధుల బృందం చురుగ్గా పాల్గొన్నది. రాష్ట్ర పర్యాటక శాఖ తరపున డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పద్మారాణి, మార్కెటింగ్ మేనేజర్ రఫీక్ అహ్మద్ తదితర ఉన్నతాధికారులు ఈ సదస్సులో పాల్గొని ఏపీ పర్యాటక రంగానికి సంబంధించిన విశేషాలను ప్రపంచ దేశాల ప్రతినిధులకు వివరించారు.ఏపీ పర్యాటక శాఖ స్టాళ్లలో రాష్ట్రంలోని ప్రముఖ ట్రావెల్ మరియు హాస్పిటాలిటీ సంస్థలు తమ సేవలను ప్రదర్శించాయి. ఇందులో విశాఖపట్నం నుండి ప్రవాసిన్, ట్రెక్ సమ్, హాలిడే వరల్డ్, రాడిసన్ బ్లు రిసార్ట్ లు, తిరుపతి నుండి బృందావన్ హాలిడేస్, స్టార్ లెట్ స్యూట్, న్యూఢిల్లీ నుండి ఈజ్ మై ట్రిప్ తదితర ప్రముఖ సంస్థలు భాగస్వాములయ్యాయి. ప్రధానంగా రాష్ట్రంలోని టూర్ ఆపరేటర్లను నేషనల్, ఇంటర్నేషనల్ లెవల్ టూర్ ఆపరేటర్లతో అనుసంధానం చేయడం ద్వారా పర్యాటక నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడం లక్ష్యంగా ఏపీ బృందం తమదైన ప్రదర్శన చేసింది. ఏపీలోని సుదీర్ఘ తీరప్రాంతం, అరకు లోయ, గండికోట, ఆధ్యాత్మిక క్షేత్రాలైన తిరుపతి, విజయవాడ, శ్రీశైలం వంటి పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తోంది. వివిధ దేశాల పర్యాటకులను ఆకర్షించేలా తక్కువ ఖర్చుతో కూడిన వినూత్న ప్యాకేజీలను టూర్ ఆపరేటర్ల ద్వారా రూపొందించడం వంటి అంశాలను ఈ బృందం చర్చించింది. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించిన నేపథ్యంలో ఈ సదస్సు ఇన్వెస్టర్లను ఆకర్షించడానికి వేదికగా నిలిచింది. పర్యాటక శాఖ రూపొందించిన '2024-29 నూతన పర్యాటక పాలసీ' గురించి ఇక్కడి ప్రతినిధులకు వివరించారు. దీనివల్ల రాబోయే రోజుల్లో ఏపీకి మరిన్ని విదేశీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ బ్రాండ్‌ను అంతర్జాతీయ వేదికపై పెంపొందించడమే తమ లక్ష్యమని, ూాూజు వంటి వేదికల ద్వారా ఏపీ రాష్ట్ర పర్యాటక సంపదను ప్రపంచానికి చూపిస్తున్నామన్నారు. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు చేదోడుగా నిలుస్తుందని ఏపీ పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు. పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఉన్నతాధికారులు అజయ్ జైన్, ఆమ్రపాలి కాటల నేతృత్వంలో రాబోయే రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ పర్యాటక సదస్సుల్లో పాల్గొని ఏపీ టూరిజాన్ని నంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఏపీటీఏ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న టూర్ ఆపరేటర్స్‌కి న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ సదస్సులో ఏపీ పెవీలియన్ తరపున పాల్గొనే అవకాశం లభించడమే గాక జాతీయ, అంతర్జాతీయ ఏజెన్సీస్ ను కలిసే అవకాశం దొరకడం విశేషం.. తద్వారా వారి సేవలు మరింత విస్తరించేందుకు వీలు కలుగుతుంది.. ఈ నేపథ్యంలో ఏపీటీఏ పోర్టల్ లో టూర్ ఆపరేటర్లు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకుంటే వారికి ఈ అవకాశం కలుగుతుందని అధికారులు వెల్లడించారు.

### అంతర్జాతీయ కిక్‌బాక్సింగ్ కప్‌లో

# లేఖా నీహారికకు మూడు పతకాలు

## అభినందించిన జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

న్యూఢిల్లీ లోని కే.డి. జాధవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కిక్‌బాక్సింగ్ కప్-20 పోటీలలో రామచంద్రపురానికి చెందిన కారుమూరి లేఖా నీహారిక అద్భుత ప్రతిభ కనబరిచి రెండు బంగారు, ఒక రజత పతకాలను సాధించి కోనసీమ జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై రెపరెపలాడించింది. లేఖా నీహారిక లైట్ కాంటాక్ట్ విభాగంలో రెండు బంగారు పతకాలను గెలుచుకోగా, క్రియేటివ్ ఫామ్ వెపన్ విభాగంలో ఒక రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఆమె ప్రతిభకు గుర్తింపుగా బెంగళూరులో నిర్వహించనున్న ఖేలో ఇండియా సౌత్ జోన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపింది. ఈ సందర్భంగా లేఖా నీహారిక డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్. మహేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. లేఖా నీహారిక విజయానికి సహకరించిన తల్లిదండ్రులు, కోచ్ బి.కె. రత్నం, కోచ్ అంజనీకుమార్‌లను జిల్లా కలెక్టర్ అభినందించారు.

### నియోజకవర్గంలో అర్హులందరికీ

# సీఎం రిలీఫ్ ఫండ్ అందుతుంది

## తెదేపా యువ నాయకులు బండారు సంజీవ్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పేద, మధ్యతరగతి వర్గాలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ ఎమ్మెల్యే బండారు కృషితో పేద, మధ్యతరగతి వర్గాల్లో అటు ఎన్టీఆర్ ఆరోగ్య సేవ, ఇటు హెల్త్ ఇన్సూరెన్స్ వర్తించని వర్గాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న సీ.ఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని యువనాయకులు బండారు సంజీవ్ వ్యాఖ్యానించారు. వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని చెక్కులను అందజేశారు. అనంతరం సంజీవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషితో మన నియోజకవర్గంలో అర్హులందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొత్తపేట మండలానికి చెందిన 56 మందికి రూ.23,50,326లు విలువైన చెక్కులు అందజేశారు.

# ఆపదలో ఉన్న స్నేహితుడికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవత్వం చాటుకున్న వానపల్లి హై స్కూల్ 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు వానపల్లి హై స్కూల్ 1999-2000 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు తమ క్లాస్ మేట్ కుకునూరి వీర వెంకట సత్య దుర్గా ప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసి ముందుకొచ్చారు. తమతో పాటు చదువుకున్న స్నేహితుడు ఆపదలో ఉన్నాడని తెలుసుకున్న వెంటనే, అందరూ కలిసి తమ వంతు ఆర్థిక సహాయం అందించేందుకు సహకరించారు.వారి సహకారంతో మొత్తం రూ.70,000 వసూలైంది. కుకునూరి దుర్గా ప్రసాద్ మరియు వారి కుటుంబ సభ్యుల కోరిక మేరకు అందిన మొత్తంలో రూ.60,000 బ్యాంకులో డిపాజిట్ చేయగా, రూ.10,000 నగదు రూపంలో అందజేశారు. ఆపదలో ఉన్న స్నేహితుడికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థుల మానవత్వాన్ని గ్రామస్తులు అభినందించారు. సహకరించిన టీచర్లు, స్నేహితులు మరియు స్నేహితురాళ్లకు దుర్గా ప్రసాద్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ కుమార్తె

# వివాహ వేడుకలో రాజకీయ ప్రముఖులు





**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ కుమార్తె చి.సాయినవ్య వివాహ వేడుకలో మాజీ జెడ్పీ చైర్మన్ నామన రాంబాబు, మాజీ మంత్రి వైసిపి నాయకులు చెల్లుబోయిన వేణుగోపాల శ్రీనివాస్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి మరియు కొత్తపేట నియోజకవర్గ ముఖ్య నాయకులు.కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్ వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తోట స్వామి, బొక్క ఆదినారాయణ, దొంగ సుబ్బారావు, భావన శివశంకర్, గుత్తుల నాగేశ్వరరావు, చల్ల బాబి, ఎలుగుబంటు కనకయ్య, నాయకులు,అధికారులు పాల్గొని నూతన వధూవరులైన సాయి నవ్య &ఫణి కిరణ్‌లను ఆశీర్వదించారు.

# శ్రీ మారెమ్మ తల్లి జాతర మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామ దేవతల ఆరాధన మన ప్రాచీన సంస్కృతికి ప్రతిబింబమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం శ్రీ మారెమ్మ తల్లి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల పోస్టర్ ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలని నిర్వాహకులకు ఆయన సూచించారు.

# శ్రీ బాల లక్ష్మీ గణపతి ఆలయ విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న చిర్ల జగ్గిరెడ్డి





**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గం, కొత్తపేట మండలం, పలివెల శేరేపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ బాల లక్ష్మీ గణపతి ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆ ఆలయానికి గుడి నిర్మాణ నిమిత్తం జగ్గిరెడ్డి గారు 20,000 వేల రూపాయలు కమిటీ పెద్దలకు యువతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అన్నదాతల అభివృద్ధికి మార్కెట్ యార్డ్‌లు దోహదం

## కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నదాతలకు అండగా, వారి అభివృద్ధికి తోడుగా మార్కెట్ యార్డులు నిలుస్తాయని కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. బుధవారం కాజులూరులో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ లుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ద్రాక్షారామం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా అక్కల రిశ్వంతరాయ్‌తో పాటు నూతన డైరెక్టర్ల బృందం మార్చి 8న ఘనంగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, వ్యవసాయశాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు సత్యం వివరించారు. అన్ని గ్రామాల నుండి కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఏఎంసీ చైర్మన్‌గా అక్కల రిశ్వంతరాయ్ ప్రమాణ స్వీకారానికి పార్టీ నేతలు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఏఎంసి చైర్మన్ రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తోందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి వేల కోట్ల రూపాయలు కేటాయించి రైతు సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకుందని తెలిపారు. తనకు మార్కెటింగ్ చైర్మన్‌గా అవకాశం కల్పించిన మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం, పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ద్రాక్షారామ మార్కెట్ యార్డ్‌కు నూతన కమిటీ బాధ్యతలు చేపట్టడం ద్వారా రైతులకు మరింత సేవలు అందుబాటులోకి తెస్తామని రిషి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దడాల నాగార్జున, కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండ వెంకన్న, మండల టిడిపి అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు), మండల బిజెపి అధ్యక్షుడు శివాజీ, డైరెక్టర్లు వల్లు అర్జునరావు, రెడ్డి శేషారావు, కొల్లు వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, సలాది పుష్పవతి, ఖండవల్లి శ్రీనివాస్, కూటమి పార్టీల నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

### క్లస్టర్ బేస్డ్ విధానంలో

# పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగాల కల్పన!

**జాబ్ మేళాల ద్వారా ఇప్పటివరకు 1.08 లక్షల మందికి ఉద్యోగాలు - ఇండస్ట్రీ టై అప్ తో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు చర్యలు**
**- సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ పై న్యూ సౌత్ వేల్స్ వర్సిటీతో ఒప్పందం**
**- న్యాక్ బలోపేతం ద్వారా ప్రపంచస్థాయి భవన నిర్మాణ కార్మికులను తయారుచేస్తాం**
**శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** సూపర్-6లో ఇచ్చిన తొలి హామీ 5ఏళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన. ఒకేరాష్ట్రం, ఒకేరాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ప్రజాప్రభుత్వ లక్ష్యం. అందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్లస్టర్ బేస్డ్ విధానాన్ని తీసుకొని ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శాసనసభలో స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలు ఏమేరకు ఆశించిన ఫలితాలు ఇస్తున్నాయి, శిక్షణా కేంద్రాల పనితీరు, ఉద్యోగావకాశాలు, ప్రతిపాదిత నూతన పారిశ్రామిక భాగస్వామ్య వివరాలపై ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారా యణ, యార్లగడ్డ వెంకట్రావు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వెంకటరాజు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... రాయలసీమ, అనంతపురంలలో ఆటోమోటివ్ క్లస్టర్, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, సిమెంట్ క్లస్టర్, కడప, చిత్తూరులో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్, నెల్లూరులో గ్లాస్, ఏసీ క్లస్టర్ వస్తోంది. ప్రకాశం జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్ క్లస్టర్, అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ క్లస్టర్, గోదావరి జిల్లాలో ఆక్వా క్లస్టర్, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైసెస్ మ్యానుఫ్యాక్చరింగ్, స్టీల్ క్లస్టర్ వస్తున్నాయి. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ కూడా వస్తున్నాయి. ఆయా క్లస్టర్లలో వర్టికల్, హారిజంటల్ ఇంటిగ్రేషన్ చాలా అవసరం. కేవలం బేసిక్ మ్యానుఫ్యాక్చరింగ్ మాత్రమే కాకుండా అనుబంధ తయారీ యూనిట్లు కూడా అదే క్లస్టర్ లోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. యాపిల్ మొబైల్ సంస్థ డిజైనింగ్, మార్కెటింగ్ చేస్తుంది. మ్యానుఫ్యాక్చరింగ్ ఫాక్స్ కాన్ చేస్తుంది. అయితే అన్ని కాంపొనెంట్ లను ఫాక్స్ కాన్ తయారు చేయదు. 2వేలమంది సప్లయర్స్ దగ్గర నుంచి ఫాక్స్ కాన్ కాంపొనెంట్స్ కొనుగోలు చేస్తుంది. వారందరినీ ఒక ఎకోసిస్టమ్ లోకి తీసుకురావాలన్నది మా ఆలోచన. మరొకటి గ్లాస్ మ్యానుఫ్యాక్చరింగ్. భారతదేశంలో గ్లాస్ వినియోగం పెరుగుతోంది. ఇందుకు సంబంధించిన పరిశ్రమలను ఒకే క్లస్టర్ లోకి తీసుకురావాల్సి ఉంది. మరొకటి సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్. వేఫర్ మ్యానుఫ్యాక్చరింగ్ కు సంబంధించి ఉత్తరాంధ్రకు కొన్ని, రాయలసీమకు కొన్ని పరిశ్రమలు వస్తున్నాయి. ఇందుకు సంబంధించి యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (సిడ్నీ)తో సంప్రదించి ర్యాపిడ్ ప్రొటోటైపింగ్ టెస్టింగ్, డిజైన్ సెంటర్‌ను తిరుపతి ఐఐటికి తీసుకురావడానికి కృషిచేస్తున్నాం. క్లస్టర్ విధానంలో వర్టికల్ అంటే వివిధ రకాల కంపెనీలను తీసుకురావడం. హారిజంటల్ అంటే ఎడ్యుకేషన్. అందులో స్కిల్ డెవలప్ మెంట్ కీలకమైన పాత్ర పోషిస్తుంది. కోర్సులను అప్ గ్రేడ్ చేయాల్సి ఉంది. సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ కు సంబంధించిన బీ.టెక్, ఎం.టెక్, రిసెర్చ్ ప్రోగ్రామ్ లను ప్రవేశపెట్టేందుకు తిరుపతి ఐఐటి డైరెక్టర్ తో మాట్లాడుతున్నాం. క్లస్టర్ లో టెస్టింగ్, సర్టిఫికేషన్ సౌకర్యాలను కల్పించాల్సి ఉంటుంది. భారతదేశంలో తయారయ్యే వంద ఏసీలలో 50 ఆంధ్రప్రదేశ్ లోనే తయారవుతున్నాయి. భారీ పరిశ్రమల మంత్రి టీజీ భరత్ కృషితో డైకిన్, ఎల్ జీ, బ్లూస్టార్ వంటి కంపెనీలు వచ్చాయి. దీనివల్ల రాబోయే రెండేళ్లలో ఏపీలో ఏసీల ఉత్పత్తి 70శాతానికి పెరుగుతుంది. నేను వాళ్లను



కలిసినపుడు ఐటీఐలను తమ యూనిట్లకు అనుసంధానించాలని కోరారు. కరిక్యులమ్, ఎక్విప్ మెంట్ తామే ప్రొవైడ్ చేసి, గైడ్ చేస్తామని, ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలని చెప్పారు. కీలకమైన హీట్ పంప్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ ఇక్కడే ఏర్పాటు చేయాలని కోరారు. యూరప్ పంపి ఒక్కొక హీట్ పంప్ టెస్ట్ చేయడానికి సుమారు 5లక్షల యూరోలు అవుతుంది. అందుకు అవసరమైన ఎకోసిస్టమ్ ను స్థానికంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుచేయడానికి ఎంవోయూ చేసుకున్న 760 పరిశ్రమలను మంత్రుల బృందం ట్రాక్ చేసింది. జీవోఎంలో నాతోపాటు పరిశ్రమల మంత్రి భరత్, విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టూరిజం మంత్రి కందుల దుర్గేష్ సభ్యులుగా ఉన్నాం. వారందరితో చర్చలు జరిపి వారికి కావాల్సిన కోర్సులు, మ్యాన్ పవర్ పై మ్యాపింగ్ చేశాం. దీనిపై ఒక్కొక సెక్టార్ కు ఒక్కొక ఇండస్ట్రీ లీడర్ ను గుర్తించి వారికి బాధ్యత అప్పగిస్తున్నాం. సిస్టమాటిక్ గా 22 క్లస్టర్లలో ఎకోసిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం. సుజలాన్ తో మాట్లాడి 5 గ్రీన్ ఎనర్జీ ల్యాబ్ లు ఏర్పాటుచేసి, ఏటా 12వేలమంది టెక్నీషియన్లకు విండ్ ఎనర్జీలో శిక్షణ ఇస్తున్నాం. ఏఐ అడ్వాన్స్ డ్ ట్రైనింగ్ కోసం మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ తో ఒప్పందం చేసుకున్నాం. రాయల్ ఎన్ ఫీల్డ్ ఒక ఐటీఐని ఎడాప్ట్ చేసుకుని వారికి కావాల్సిన సాంకేతికతతో మెకానిక్ లకు శిక్షణ ఇస్తుంది. యువగళం పాదయాత్రలో ఆటో మెకానిక్‌లు, టూవీలర్ మెకానిక్‌లను కలిశాను. ప్రస్తుతం టెక్నాలజీ అప్ గ్రేడ్ అయినందున కొత్త సాంకేతికతలపై వారికి కావాల్సిన ట్రైనింగ్ అందించడానికి ఇండస్ట్రీతో టై అప్ కావాల్సి ఉంది. ఈ నెలలోనే సెయింట్ గోబిన్స్ తో ఒక ఒప్పందం కుదుర్చుకుంటున్నాం. న్యాక్ లో ఫాల్ సీలింగ్ అండ్ డ్రైవ్ ఆన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేస్తున్నాం. ఆసియన్ పెయింట్స్ ఆధ్వర్యాన మరో సీఓఈ, ఎల్ అండ్ టీ ఆధ్వర్యాన అంతర్జాతీయస్థాయి మ్యాన్ పవర్ పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నాం. అల్ట్రాటెక్, శ్రీ సిమెంట్స్ తో మాట్లాడాం. సిమెంట్ ఎకోసిస్టమ్ లో కూడా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో 3నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు 1587 జాబ్ ఫెయిర్లు నిర్వహించగా, 11,373 కంపెనీలు పాల్గొని 1,08,747 మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగింది. జాబ్ మేళాల్లో ఎమ్మెల్యేలంతా భాగస్వాములు కావాలి. ప్రస్తుతం లిఫ్ట్ మెకానిక్ ల షార్టేజీ ఎక్కువగా ఉంది. నెలకు 30వేలు జీతం ఇస్తామన్నా ఆ టెక్నీషియన్లు దొరకడం లేదు. ఎలక్ట్రీషియన్లు, క్వాలిటీ ప్లంబర్లకు కూడా తీవ్రమైన కొరత ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీ ఎస్ఎస్ డీసీ, సీడాప్, న్యాక్ ద్వారా 73వేలమందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. అందులో 40వేలమందికి ఉద్యోగాలు లభించాయి. కులవృత్తులను ప్రోత్సహించేందుకు గౌరవ ప్రధానమంత్రి పీఎం విశ్వకర్మ పథకాన్ని కూడా ప్రవేశపెట్టారు. బీసీ సంక్షేమ మంత్రి, ఎంఎస్ఎంఈ మంత్రులతో మాట్లాడి ఇప్పటికే 1.89 లక్షలమందికి అందులో శిక్షణ ఇచ్చాం. క్యాంపస్ లలో ఏఐ, మిషన్ లెర్నింగ్ పై యాడ్ ఆన్ కోర్సులు తీసుకువచ్చి, 3.11 లక్షలమందికి శిక్షణ ఇచ్చాం. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి స్కిల్ సెన్సస్ పై విస్తృతంగా చర్చించారు. మంగళగిరిలో స్కిల్ సెన్సస్ చేపట్టాలని ప్రయత్నించినపుడు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఆ అనుభవంతో స్కిల్ ఎసెస్ మెంట్ చేయాలని నిర్ణయించాం. అందులో భాగంగా త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభించబోతున్నాం. ఇందులో ఆధార్ బేస్డ్ క్రెడెన్షియల్ వెరిఫికేషన్ తోపాటు, బిల్డ్ యువర్ ఓన్ రెస్యూమ్ కాలమ్ ద్వారా విద్యార్థులు తమ రెస్యూమ్ ను అప్ లోడ్ చేయడంతో అప్ గ్రేడ్ చేయవచ్చు. ఇందులో ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా ఏఐ బేస్డ్ స్కిల్ కోర్సులను కూడా నేర్చుకోవడానికి అవకాశం కల్పిస్తాం. కాన్వర్సేషన్ ఏఐ టూల్ ద్వారా సెల్ఫ్ ఎసెస్ మెంట్ చేసుకోవడానికి ఇందులో అవకాశం ఉంటుంది. ఏసీ మెకానిక్ నుంచి ఏఐ ఇంజనీర్ వరకు ఎసెస్ మెంట్ కు అవకాశం కలుగుతుంది. ప్రపంచంలోనే తొలిసారిగా ఇటువంటి పోర్టల్ ను ప్రవేశపెట్టబోతున్నాం. మార్చి చివరి నాటికి ఇది పూర్తిస్థాయిలో సిద్ధమవుతుంది. ఏఐ బేస్డ్ ఎగ్రిగేషన్ ద్వారా ఉద్యోగ అవకాశాలను కూడా ఇందులో అందుబాటులో ఉంచుతాం. ఏఐ ట్యూటర్ ద్వారా ఇంటర్వ్యూలకు శిక్షణ కూడా ఇస్తాం. నర్సింగ్ పై పారా మెడికల్ కోర్సుల్లో కూడా ట్రైనింగ్ ఇవ్వాలని సభ్యులు కోరారు. యూరప్, జపాన్, జర్మనీలలో ఈ కోర్సులకు చాలా డిమాండ్ ఉంది. ఇందుకోసం ఓంక్యాప్ ద్వారా లాంగ్వేజ్ ట్రైనింగ్ చేస్తున్నాం. ఇప్పటికే 150మందిని వివిధ దేశాలకు పంపించాం. 5లక్షలమందిని విదేశాలకు పంపడం మా లక్ష్యం. గతంలో ఎపెక్స్ స్కిల్ యూనివర్సిటీ, పార్లమెంటు, నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ కాలేజి ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు కానీ ఒక్కటి కూడా అమలుకాలేదు. గతంలో స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ సిబ్బందితో పార్టీ పనిచేయించి ఉంటే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. జాబ్ మేళాల నిర్వహణలో క్వాలిటీ పెంచుతాం. అందరం కలిసికట్టుగా పనిచేస్తే 175 నియోజకవర్గాల్లో ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించవచ్చు. ప్రతి స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ను సీసీ టీవీ మానిటరింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నాం. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ కూడా అమలు చేస్తున్నాం. డైట్, బి.ఎడ్, ఇంజనీరింగ్ కాలేజీలలో కూడా ఎఫ్ఆర్ఎస్ పెట్టాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. న్యాక్ ను బలోపేతం చేసి, వరల్డ్ క్లాస్ క్వాలిటీ వర్కర్స్ ను తయారు చేస్తాం. రాబోయే 90రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన న్యాక్ ను బలోపేతం చేసే చర్యలు చేపట్టబోతున్నాం. ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ పై యార్లగడ్డ నేతృత్వంలో ఐదుగురితో ఒక కమిటీ వేస్తామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# బాధిత కుటుంబానికి బుజ్జి ఆర్థిక సహాయం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం నెల్లిపూడికి చెందిన నక్కా రమణమ్మ ఇటీవల కాలంలో అనారోగ్యంతో కాలం చేశారు. ఆమె కుమారుడు రాజు కుటుంబ సభ్యులను శంఖవరం మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు, నెల్లిపూడి జనసేన పార్టీ అధ్యక్షుడు తలపంటి అప్పారావు (బుజ్జి) మంగళవారం పరామర్శించారు. ఏ అవసరం వచ్చినా గ్రామ జనసేన పార్టీ తరఫున మీకు నేను అండగా ఉంటానని బుజ్జి ఆ బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. కుటుంబ పెద్ద దిక్కుగా ఉన్న రమణమ్మను కోల్పోయి, కుటుంబ జీవనానికి ఆమెపైన ఆధారపడిన రాజు కుటుంబ సభ్యులకు రెండు నెలల జీవన భృతిగా 50 కేజీల బియ్యాన్ని, కొంత మొత్తం నగదును తన వంతు సామాజిక బాధ్యతా సాయంగా బుజ్జి అందించారు. గ్రామంలో ఎవరికి ఏ ఆపద, ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆదుకోవడంలో బుజ్జి ముందుంటారు. సామాజిక సేవా సేవా కార్యక్రమాలను చేయడంలో జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ మాకు ఎల్లప్పుడూ ఆదర్శమని బుజ్జి చెబుతూ ఉంటారు. ఈ కార్యక్రమంలో బుజ్జి వెంట నెల్లిపూడి జనసేన గ్రామ నాయకులు తలపంటి బలరాం, తలపంటి వీరబాబు, పిర్ల నాని, దూల శీను, కోరాడ జాను, శివకోటి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# అమరావతి రెవెన్యూ ఉద్యోగుల ప్రత్తిపాడు జేఏసీ ఏకగ్రీవం



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరావతి రెవెన్యూ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సంఘం ప్రత్తిపాడు మండల శాఖ ఏకగ్రీవంగా ఎన్నికైంది. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శివరామ్, కాకినాడ జిల్లా జాయింట్ సెక్రటరీ అవసరాల కిషోర్ సమక్షంలో ప్రత్తిపాడు మండల వనరుల కేంద్రంలో బుధవారం ఈ ఎన్నుకలను నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి, కో చైర్మన్‌గా మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎ.గోపాలకృష్ణ, కన్వీనర్‌గా విఆర్వో ఈపి రాజేష్, సెక్రెటరీ జనరల్ గా విలేజ్ సర్వేయర్ డి.నఖిల్, ట్రెజరర్‌గా వీఆర్వో పద్మిని, వైస్ చైర్మన్-1గా డి.సాయివర్మ (సీనియర్ అసిస్టెంట్), వైస్ చైర్మన్-2గా వి.శివ (వీఆర్వో), వైస్ చైర్మన్-3గా ఎం.గంగరాజు (విఆర్ఎ), వైస్ ఛైర్మన్-4 గా ఎం.వీరదుర్గ (విఎస్), జాయింట్ సెక్రటరీ-1గా వి.గుర్రాజు (విఆర్వో), జాయింట్ సెక్రటరీ-2గా కె రామకృష్ణ (విఆర్ఎ), జాయింట్ సెక్రటరీ-3గా జి.లోవరాజు (విఎస్) ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. నూతన కమిటీని తాహాశీల్దార్ ఎం.సూర్యప్రభతో పాటు పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# నేడు లేగ పెయ్య దూడల ప్రదర్శన



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన కాజులూరు పశువైద్యశాల వద్ద గురువారం లేగ పెయ్య దూడల ప్రదర్శన నిర్వహిసుం చనున్నట్లు కాజులూరు మండల పశువైద్యాధికారి చెక్కపల్లి శ్రీరామ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన కాజులూరు పశు వైద్యశాల వద్ద వైద్యాధికారి చెక్కపల్లి శ్రీరామ్ మాట్లాడుతూ గురువారం పశువైద్యశాల వద్ద లేగ పెయ్యదూడల ప్రదర్శన నిర్వహిస్తున్నామని ఈ ప్రదర్శనకు కాజులూరు పరిసర ప్రాంత పాడి రైతులు పాల్గొని ప్రదర్శించాలని కోరారు. ఈ దూడల ప్రదర్శనలో ఉత్తమ పెయ్య దూడలకు బహుమతులు అంద చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కాకినాడ పశువైద్యశాల జెడిఎ కొల్లా కృష్ణమూర్తి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ డిఎల్‌డిఏ డిప్యూటీ డైరెక్టర్ కాంతారావు తాళ్లరేవు ఏడీఏ తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

### పులివెందులలో జగన్..

# ఆ విమర్శలకు చెక్!



మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో పర్యటిస్తున్నారు. మంగళవారం పులివెందులకు వెళ్లిన జగన్ బుధవారం నియోజకవర్గ పరిధిలోని వేంపల్లె మండలం నందిపల్లె గ్రామంలో నందీశ్వర ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైసీపీ నేతల చొరవతో రూ.6 కోట్ల విరాళాలతో ఈ ఆలయాన్ని పునర్నిర్మించారు. వైసీపీ అధినేత జగన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి నందీశ్వరుడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేయించారు. సొంత నియోజకవర్గంలో నందీశ్వర ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ సీఎం జగన్ తనపై కూటమి ప్రభుత్వం చేస్తున్న విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నం చేశారని అంటున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని వాడారంటూ గత కొన్ని నెలలుగా వైసీపీని టార్గెట్ చేస్తూ కూటమి నేతలు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మాజీ సీఎం జగన్ కు హిందూ మతం అంటే గౌరవం లేదని, హిందూ మత విశ్వాసాలపై నమ్మకం లేదని కూటమి నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ఈ తరహా ఆరోపణలు, విమర్శలతో మాజీ సీఎం జగన్ ను ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అంటున్నారు. అయితే తనపై కూటమి నేతలు చేస్తున్న విమర్శలపై జగన్ నేరుగా స్పందించకపోయినా, సొంత నియోజకవర్గం పులివెందులలో శివాలయం ప్రతిష్టకు హాజరుకావడం, స్వయంగా పూజలు, హోమాలు చేయడం ద్వారా తనకు హిందూ దేవుళ్లపై నమ్మకం ఉందని చాటుకున్నారని అంటున్నారు. సంప్రదాయ వస్త్రాలను ధరించి నందీశ్వరుని నూతన విగ్రహా ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవంలో జగన్ పూజలు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా తనకు హిందూ మత ఆచార, వ్యవహారాలు అంటే గౌరవం ఉందని చాటుకునే ప్రయత్నం చేశారని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం సందర్భంగా ఎలాంటి రాజకీయ ప్రకటనలు చేయకపోవడం గమనార్హం అంటున్నారు. వైసీపీ కార్యకర్తలు సైతం పూర్తి భక్తి ప్రవర్తులతో నడుచుకోవడాన్ని ప్రత్యేకంగా చెబుతున్నారు. సాధారణంగా జగన్ ఎక్కడకు వెళ్లినా, జై జగన్, సీఎం.. సీఎం.. అంటూ ఆయన అభిమానులు నినాదాలతో హోరెత్తిస్తుంటారు. అయితే సొంత నియోజకవర్గం పరిధిలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో రాజకీయ నినాదాలు చేయకుండా శ్రేణులను వైసీపీ నేతలు కట్టడి చేయడం కూడా ఆకట్టుకుందని అంటున్నారు. మొత్తానికి శివుడి ద్వారా తనపై కూటమి నేతలు చేస్తున్న విమర్శలను జగన్ తిప్పికొట్టే ప్రయత్నం చేశారని వ్యాఖ్యానిస్తున్నారు.

### జగన్‌కి, వైసీపీ నేతలకు

# దేవుడంటే భక్తి లేదు, భయం లేదు...

- వైసీపీ హయంలో 300కు పైగా దేవాలయాలపై దాడులు, ధ్వంసం...
- శ్రీవారి లడ్డూలో కల్తీ, హిందువుల మనోభావాలంటే వైసీపీకి లెక్కలేదు...
- శాసనమండలిలో వైసీపీ సభ్యుల తీరుపై ఘాటుగా స్పందించిన ఎమ్మెల్యే గోరంట్ల...



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి ఫొటోలను చెప్పులు, షూలు వేసుకుని నినాదాలు చేస్తూ రాజకీయం చేసే నీచానికి వైసిపి వాళ్ళు దిగజారారని రాజమహేంద్రవరం గ్రామీణ శాసన సభ్యులు, టిడిపి సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శించారు. ఇదంతా జగన్మోహన్ రెడ్డి ఒక పథకం ప్రకారం డైరెక్షన్ లోనే జరిగిందని ఆయన పేర్కొన్నారు. శాసన మండలిలో వైసిపి సభ్యుల చేష్టలపై ఎమ్మెల్యే గోరంట్ల ఘాటుగా స్పందిస్తూ, ఒక ప్రకటన విడుదల చేసారు. జగన్ మోహన్ రెడ్డికి, వైసీపీ నేతలకు దేవుడంటే భక్తి లేదు, భయం లేదు. హిందువుల మనోభావాలంటే లెక్కలేదని ఆయన వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలను బూతులు, వెకిలివేషాల కేంద్రాలుగా మార్చారని, ఇప్పుడు ఏకంగా దేవుడి ఫొటోలతో దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే గోరంట్ల విమర్శించారు. హిందూమత విశ్వాసాల పట్ల, తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయాలు, సంస్కృతి పట్ల జగన్మోహన్ రెడ్డికి ముందు నుంచీ చిన్నచూపు ఉందని ఆయన పేర్కొన్నారు. పరమపవిత్రమైన దేవుడి ప్రసాదాన్ని జంతు కొవ్వు, ప్రమాదకర రసాయనాలతో కల్తీ చేసారని, శ్రీవారి పరకామణిలో విదేశీ కరెన్సీని కొల్లగొట్టిన కేసులో నిందితుడైన రవికుమార్ తో రాజీ చేసుకుని అతని ఆస్తులను టీటీడీ పేరిట రాయించి దొంగలకు పెద్దన్న లాగా జగన్ రెడ్డి నిలిచాడని ఆయన విమర్శించారు. శ్రీవారి ఆలయంలో శ్రీవారి నామస్మరణ తప్ప మారేది వినిపించదని, అలాంటి పవిత్ర ప్రదేశంలో జగన్మోహన్ రెడ్డి పిన్నిచేత 'జగన్ రెడ్డి రక్షక గోవింద' అని పొగిడించుకుని శ్రీవారిని అవమానించి కోట్లాదిమంది హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఎమ్మెల్యే గోరంట్ల ధ్వజమెత్తారు. తిరుమల మాడవీధుల్లో చెప్పులతో తిరిగిన జగన్మోహన్ రెడ్డి స్వామివారి పట్ల ఉన్న నిర్లక్షాన్ని చాటుకున్నాడని ఆయన విమర్శించారు. వీఐపీ బ్రేక్, సేవా టిక్కెట్లు అమ్ముకున్నారు.. సేవా టిక్కెట్లు, దర్శన టిక్కెట్లు, ప్రసాదాలు అన్నింటిలోనూ బ్లాక్ మార్కెట్ నడిపి కోట్లు దండుకున్నారని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. చివరకు రూ.2 కోట్లవిలువైన తలనీలాలను మొదట మయన్మార్, అక్కడి నుంచి థాయ్ ల్యాండ్ మీదుగా చైనాకు అక్రమంగా తరలిస్తుండగా అస్సాం రైఫిల్స్ పట్టుకోవడమే దీనికి ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. రామతీర్థంలో రాములవారి శిరస్సు ఖండన చేయడం వంటి దాష్టీకానికి ఒడిగట్టారని, ఇలా ఒకటికాదు,రెండు కాదని, వందలాది దాడులు హిందూదేవాలయాలపై జగన్ పాలనలో పదేపదే ప్రతిరోజు జరుగుతుండేవని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. దోషులను శిక్షించకుండా హిందువులకు మనోధైర్యం ఇవ్వకుండా, ఈ ఘటనలు ఖండిస్తున్నామని కూడా చెప్పకుండా ఐదేళ్లు జగన్ రెడ్డి హిందూ వ్యతిరేక విధానాలు కొనసాగించాడని ఆయన ఎద్దేవా చేసారు.వైసీపీ హయంలో 300కు పైగా దేవాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం ఘటనలు జరిగితే, ముఖ్యమంత్రిగా ఒక్కరోజు కూడా వెళ్లి జగన్మోహన్ రెడ్డి పరిశీలించలేదని ఆయన వాపోయారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించాల్సి ఉంటె, జగన్మోహన్ రెడ్డి మాత్రం ఏ రోజు సతీసమేతంగా పట్టువస్త్రాలు ఇవ్వకుండా హిందూ సంప్రదాయాలను కాలరాయడం తెల్సిందేనని ఎమ్మెల్యే గోరంట్ల ప్రస్తావించారు, అన్యమతస్థుడైన జగన్ రెడ్డి.. ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండా తిరుమల పర్యటించడం, స్వామి వారికి తాను ఒక్కడే పట్టువస్త్రాలు సమర్పించడంపై పండితులు, మేధావులు అభ్యంతరంవ్యక్తం చేసినా జగన్ రెడ్డి ఏ రోజు ఖాతరు లేదని ఆయన గుర్తుచేశారు. దేవాలయాల భూములపై, మాన్సాస్ ట్రస్ట్ ఆస్తులపై, టీటీడీ ఆస్తుల అమ్మకంపై ఉన్న శ్రద్ధదేవాలయాల పరిరక్షణపై జగన్మోహన్ రెడ్డికి లేదని ఆయన పేర్కొన్నారు. అనేక ఘటనల ద్వారా తిరుమల పవిత్రతను దెబ్బతీశాయని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో బలవంతపు మత మార్పిడులు నిత్యకృత్యంగా మార్చాడని, రాష్ట్రంలో 2500 దేవాలయాల ట్రస్ట్ లను నిర్వీర్యం చేసి హిందూమతంపై దాడి చేసిన పాపాత్ముడు జగన్ రెడ్డి అని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. ఈవిధంగా దేవదేవుడితో ఆటలు ఆడడం వలన 11 సీట్లకు పడిపోయాడని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. అయినా సిగ్గు, బుద్ధి రాలేదని, చేసిన తప్పులు ఇప్పటికైనా ఒప్పుకుని దేవుడిని క్షమాపణ వేడుకోకపోతే, భవిష్యత్తులో 11సీట్లు కూడా రావని ఆయన పేర్కొన్నారు.

# మార్చి 24న ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ

ప్రవీణ్ పగడాలది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే - కోర్టును ప్రభావితం చేసేలా సిఎం వ్యాఖ్యలు సరికాదు
ప్రవీణ్, సిఐ సతీష్‌ల మృతిపై సిట్ విచారణ ఎందుకు వేయరు? : మాజీ ఎంపి జీవి హర్షకుమార్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాస్టర్ ప్రవీణ్ పగడాలది ముమ్మాటికీ ప్రభుత్వాలు చేసిన హత్యేనని అమలాపురం పార్లమెంట్ మాజీ సభ్యులు జీవి హర్షకుమార్ అన్నారు. ప్రవీణ్‌ను ఎవరు హత్యచేశారో, ఎందుకు చేశారో కూడా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు తెలుసునన్నారు. స్థానిక రాజీవ్‌గాంధీ కళాశాలలోని సమావేశపు హాలులో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హర్షకుమార్ మాట్లాడుతూ ఒక పాస్టర్ తాగుతూ వచ్చి ప్రమాదంలో మరణిస్తే, దానిపై మత విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి చంద్రబాబు నాయుడు పలు మార్లు వ్యాఖ్యానించడం కోర్టును ప్రభావితం చేయడమేనని ఆరోపించారు.ప్రవీణ్ కేసు ఒకవైపు కోర్టులో నడుస్తుండగా సిఎం ఎలా ఆ కేసుపై ఈ విధమైన వ్యాఖ్యలు చేస్తారని ప్రశ్నించారు. ప్రవీణ్ పగడాల పోస్టు మార్టం రిపోర్టు చూస్తే ఆయన హత్యకు గురయ్యారని తెలిసిపోతుందన్నారు. అలాగే అటాప్సీ రిపోర్ట్‌లో ప్రవీణ్ మద్యం సేవించలేదని కూడా స్పష్టం చేయడం జరిగిందన్నారు. ప్రవీణ్ పగడాల మరణించి 11నెలలు గడస్తుందని, ఇప్పటి వరకు కోర్టులో ఎందుకు ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయలేకపోయారని ప్రశ్నించారు. గత అక్టోబర్‌లో కోర్టు కౌంటర్ అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నిస్తే, సంతకాల స్థాయిలో ఉందని సమాధానం చెప్పారని, అక్టోబర్ నుండి ఫిబ్రవరి వరకు సంతకాలు పెడుతున్నారా అని ఎద్దేవా చేశారు. ఈ కేసు విషయంలో ఎటువంటి మతలబు లేకుంటే ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి ఇంత తాత్సారం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వమే ప్రవీణ్ పగడాలను చంపేసిందని స్పష్టం చేశారు. ఏ యాక్సిడెంట్ కేసులో అయిన మరణించిన వ్యక్తి బ్యాంక్ ఎకౌంట్‌ను సీజ్ చేయడం, ఇంటిలోని లాప్‌టాప్, ఐపాడ్‌లను స్వాధీనం చేసుకోవడం జరుగుతుందా అని ప్రశ్నించారు. పరకామణి కేసులో సాక్షిగా ఉన్న సతీష్ మృతి కేసును కూడా ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. లడ్డులో కల్తీపై సిట్ వేసిన ప్రభుత్వం ప్రవీణ్ పగడాల, సతీష్‌ల కేసులో ఎందుకు సిట్ వేయడం లేదని ప్రశ్నించారు. సతీష్ కేసు గురించి పోలీస్ అధికారుల సంఘం కూడా నోరు విప్పకపోవడం దురదృష్ట కరమన్నారు. పరకామణి కేసులో తూ.గో ఎస్పీ, మరో నలుగురు పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోర్టు చెప్పిందన్నారు. ప్రవీణ్ పగడాల మృతి చెందిన మార్చి 24న ఆయన సంస్మరణ సభను స్థానిక లూధరగిరి చర్చి ప్రాంగణంలో నిర్వహిస్తామని, సభకు ఎటువంటి ఆటంకాలు సృష్టించవద్దని కోరారు. క్రైస్తవ బోధనలు చేస్తూ మృతి చెందిన వారిని హత సాక్షులుగా క్రైస్తవులు భావిస్తారని, అటువంటి హతసాక్షి ప్రవీణ్ సంస్మరణ సభ నిర్వహించుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. సభకు సంబంధించి అవసరమైన పేపర్లతో అనుమతులు కోరతామన్నారు. 24న జరిగే పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు పెద్దఎత్తున క్రైస్తవ జనులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం క్రైస్తవులు శ్రమదినాలు పాటిస్తున్నారని, కావునా ఎటువంటి మత ఘర్షణలకు తావుండదని స్పష్టం చేశారు. ప్రవీణ్ పగడాల మృతి చెందిన సమయంలో కూడా వేలాది మంది ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చినప్పటికీ ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోలేదని గుర్తు చేశారు. 24న నిర్వహించిన సంస్మరణ సభకు సన్నాహకంగా విజయవాడ, విశాఖపట్నం, గుంటూరులో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. శాంతి యుతంగా జరిగే ఈ సభ ద్వారా క్రైస్తవుల నిరసనను ఈ ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. పాలకల్తీ ఘటనలో బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు. కేవలం ప్రభుత్వ అసమర్ధత వల్లే ఇటువంటి ఘటనలు రాష్ట్రంలో చోటు చేసుకుంటున్నాయన్నారు. తిరుపతి, సింహాచలం, శ్రీకాకులంలో జరిగిన పలు సంఘటనలు గురించి గుర్తు చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ కొరవడం కారణంగానే పాల కల్తీ సంఘన చోటు చేసుకుందన్నారు. 3నెలలకు ఒకసారి పర్యవేక్షించాల్సిన అధికారులు ఏడాదికి ఒక సారి కూడా పర్యవేక్షణకు రాని పరిస్థితులు ఉన్నాయన్నారు. నెయ్యిలో జంతు కొవ్వు లేదని, కల్తీ జరిగిందని మాత్రం సిట్ చెప్పిందన్నారు. ఏక సభ్య కమిటీ వేసినా దాని రిపోర్టు సుప్రీంకోర్టుకే సమర్పిస్తుందని, అందుచేతనే ఏకసభ్య కమిటీపై వేసిన ఫిటిషన్‌ను కొట్టేసిందన్నారు. రాష్ట్రంలో రెండు ప్రభుత్వాలు కూడా భూములను ఇష్టానుసారంగా అమ్మేశారని ఆరోపించారు. క్రిస్టియన్ సేవా సమితి జాతీయ అధ్యక్షులు మల్లెల రాజు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభలో ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తామన్నారు. ఆయన ఆత్మ శాంతి కొరకు, వారి కుటుంబానికి ఓదార్పు కొరకు ప్రార్ధనలు చేస్తామన్నారు. సంస్మరణ సభను అడ్డుకోవద్దని కోరారు. రిటైర్డ్ సిఐ సాల్మన్ రాజు మాట్లాడుతూ దేవుడు కోసం నిలబడి మరణించిన వారిని హతసాక్షి అని అంటామని, ప్రవీణ్ పగడాల మంచి బోధకుడని, ఆయన మరణం క్రైస్తవ సమాజానికి తీరని లోటన్నారు. నేతలు చేసిన వ్యాఖ్యలు ప్రవీణ్ పగడాల ప్రైవసీని, ఆయన గౌరవాన్ని భంగం కలిగించేవిగా ఉన్నాయన్నారు. ప్రవీణ్ పగడాల కేసులో ఉన్న అనేక అనుమానాలపై ఆర్టీఐ కింద దరఖాస్తులు చేసుకున్నప్పటికి ఎటువంటి సమాచారం ఇవ్వడం లేదన్నారు. విలేకరుల సమావేశంలో యర్రా రామకృష్ణ, బొంత శ్యామ్ రవిప్రకాష్, గుండాపు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


# ఫిబ్రవరి 26 నుంచి జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బుధవారం ఉదయం రాజమహేంద్రవరం నియోజకవర్గం నగర జనసేన పార్టీ ఆధ్వర్యంలో జన సైనికుల కుటుంబ ఆర్థిక భద్రతకు సేవలు గుర్తింపుకు ఉద్యమి సాదక్ ప్రదాతగా జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఫిబ్రవరి 26 నుండి ప్రారంభం రాజమండ్రి సిటీ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ అనుశ్రీ సత్యనారాయణ ఆధ్వర్యంలో క్రియాశీలక సభ్యత్వాల కొరకు సన్నహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జనసేన పార్టీ వీర మహిళా రాష్ట్ర టూరిజం డైరెక్టర్ గంట స్వరూప దేవి, నగర జనసేన ఇంచార్జ్ అనుశ్రీ సత్యనారాయణ ఉద్యమి వాలంటీర్స్‌కి దిశ నిర్దేశం చేసారు. వీర మహిళలు జనసేన పార్టీ నాయకులు ఎండోమెంట్ చైర్మన్లు, డైరెక్టర్లు, ఉద్యమి వాలెంటీర్స్, జనసైనికులు పాల్గొన్నారు.

# కల్తీ పాల దుర్ఘటన చాలా బాధాకరం

## తీవ్రంగా స్పందించిన బిజెపి నాయకుడు కంబాల శ్రీనివాసరావు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలో కల్తీ పాల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. రాజమహేంద్రవరం నగర పరిసర ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రజల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది.కల్తీ పాల దుర్ఘటన... ఐదుగురు మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం నరసాపురం గ్రామానికి చెందిన ఓ పాల వ్యాపారి, రాజమండ్రి లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాల్లో పాలు సరఫరా చేసినట్లు సమాచారం. ఇటీవల ఆ పాలు సేవించిన పలువురు తీవ్ర అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చేరగా, వారిలో ఐదుగురు మృతి చెందినట్లు తెలుస్తోంది. మరో 11 మంది నగరంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పాల సేకరణ చేసిన వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకుని, ఆయనకు చెందిన డైరీని సీజ్ చేశారు. ఏఏ రైతుల వద్ద నుంచి పాలు సేకరించారు? ఎక్కడ కల్తీ జరిగింది? పాలలో ఏవైనా విషపదార్థాలు కలిశాయా? అన్న దానిపై అధికారులు నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

**సీఎం సీరియస్... అధికారుల పరుగులు....**

ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించినట్లు సమాచారం. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించినట్లు తెలుస్తోంది. జిల్లాలోని అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రాజకీయంగా కూడా ఈ అంశం వేడెక్కింది. తెలుగుదేశం పార్టీ నాయకులు పాల కల్తీ ఘటనను ఖండిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తుండగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రభుత్వ వైఫల్యమని ఆరోపిస్తూ పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నారు.

**బాధితులకు అండగా కంబాల శ్రీనివాసరావు**

ఈ నేపథ్యంలో గోకవరం ప్రాంతానికి చెందిన సంఘ సేవకుడు, ఆధ్యాత్మిక వేత్త, విశ్వ హిందు ధర్మ పరిరక్షణ పరిషత్ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు స్పందించారు. కల్తీ పాల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తమ వంతు సహాయం అందిస్తామని ప్రకటించారు. "ప్రజల ఆరోగ్యం మీద ఇలా ప్రాణాంతకంగా ఆటలు ఆడేవారిని కఠినంగా శిక్షించాలి. బాధిత కుటుంబాలను సమాజం మొత్తం ఆదుకోవాలి. అవసరమైతే వైద్య ఖర్చులకు సహాయం చేస్తాం" అని ఆయన పేర్కొన్నారు. అలాగే పాల సరఫరా వ్యవస్థపై కఠిన పర్యవేక్షణ ఉండాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**ప్రజల్లో భయం... కట్టుదిట్టమైన తనిఖీలకు డిమాండ్....**

ఈ ఘటనతో ప్రజల్లో పాలపై అనుమానం నెలకొంది. చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా పాలు సేవించే వర్గం కావడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో పాల డైరీలు, సరఫరా కేంద్రాలపై విస్తృత తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కల్తీ పాల ఘటన తూర్పుగోదావరి జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. బాధితులకు న్యాయం జరిగేలా, భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నది ప్రజల అభిప్రాయ పడుతున్నారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిన బత్తుల వెంకటలక్ష్మి




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని వివిధ అనారోగ్య కారణాలతో చికిత్సల అనంతరం సీఎంఆర్‌ఎఫ్‌కి దరఖాస్తు చేసుకున్న వారికి స్థానిక శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సిఫారసు మేరకు మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి బాధితులకు అందజేశారు. ముని కూడలి గ్రామానికి చెందిన సానిపల్లి సూర్యారావుకు రూ.35,000/-లు, దువ్వని సునీతకు 23,400/-లు, వై నరసింహారావుకు రూ. 52,624/-లు, కాటవరం గ్రామానికి చెందిన చింతపల్లి అబ్బులకు రూ.27,655/-లు, పిట్ట సుగుణకు 53,979/-లు, పెనుగుల అభిమన్యుడుకు రూ. 35000/-ల చెక్కులను బత్తుల వెంకటలక్ష్మి స్వయంగా వెళ్లి అందజేశారు. సిఎంఆర్‌ఎఫ్ ద్వారా చెక్కులను అందుకున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఫిబ్రవరి 28న జీ తెలుగులో


# మన శంకర వరప్రసాద్ గారు చిత్రం

**- మెగాస్టార్ చిరంజీవి నయనతార, వెంకటేష్ నటించిన తారాగణంతో - జీ5లోనూ అందుబాటులో!**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటించిన సంక్రాంతి బ్లాక్‌బస్టర్ మన శంకర వరప్రసాద్ గారు మళ్లీ ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేయనుంది. హిట్ మేకర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ హై-ఆక్షన్ కామెడీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ థియేట్రికల్ రన్‌లో భారీ వసూళ్లు సాధించి, విస్తృత ప్రశంసలు అందుకుంది. మన శంకర వరప్రసాద్ గారు గ్రాండ్ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ఫిబ్రవరి 28, శనివారం సాయంత్రం 5:30 గంటలకు, మీ జీ తెలుగులో.. తప్పక చూడండి! ఈ ఏడాది సంక్రాంతి బ్లాక్బస్టర్గా నిలిచిన మన శంకర వరప్రసాద్ గారు ఫిబ్రవరి 11 నుంచి డిజిటల్ ప్లాట్‌ఫాం జీ5 వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గరపాటి, సుష్మితా కొణిదెల సంయుక్తంగా ఈ సినిమాని నిర్మించారు. మెగాస్టార్ చిరంజీవి శంకర వరప్రసాద్ పాత్రలో కనిపించగా, నయనతార, వెంకటేష్ దగ్గుబాటి, కెథరిన్ ట్రెసా, సచిన్ ఖేడేకర్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. భీమ్స్ సెసిరోలియో సంగీతం, సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం, తమ్మిరాజు ఎడిటింగ్‌తో ఈ సినిమా మరింత ఆకర్షణీయంగా మారింది. హృదయస్పర్శక కుటుంబ భావాలు, నవ్వులు పూయించే కామెడీ, థ్రిల్లింగ్ యాక్షన్ సీక్వెన్స్‌లు, ఆత్మీయ ప్రదర్శనలతో అన్ని వయసుల ప్రేక్షకులకు పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజీగా నిలిచింది. డిజిటల్ వేదికపై కూడా సెన్సేషన్ సృష్టించిన ఈ చిత్రం జీ5లో సంచలనాత్మకంగా 500 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాలను సాధించి ప్రేక్షకాదరణను మరింతగా చాటుకుంది. మెగా ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ మన శంకర వరప్రసాద్ సినిమాని జీ5, జీ తెలుగు వేదికగా మీరూ తప్పకుండా చూసేయండి.

# జాతీయ కబడ్డీ పోటీలకు నగర వాసి దుర్గారావు ఎంపిక



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫిబ్రవరి 25 ఈనెల 26, 27, 28 తేదీలలో గుజరాత్లో జరగనున్న 72వ నేషనల్ పురుషుల కబడ్డీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ టీం తరపున రాజమండ్రి కి చెందిన పిట్ట దుర్గారావు ఎంపిక అయ్యారని తూర్పుగోదావరి జిల్లా కబడి అసోసియేషన్ అధ్యక్షులు పేరం రవీంద్ర, సెక్రటరీ బురిడీ త్రిమూర్తులు తెలిపారు. పిట్టా దుర్గారావు శ్రీ స్వామి వివేకానంద మెమొరియల్ స్పోర్ట్స్ క్లబ్ అండ్ రీడింగ్ రూమ్ నుండి అనేకసార్లు నేషనల్ కబాడీ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. కబడ్డీ క్రీడాకారుడు దుర్గారావు ఆంధ్రప్రదేశ్ కబడ్డీ టీం కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడని, ఇది చాలా సంతోషకరమైన విషయమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పేరం రవీంద్ర, చైర్మన్ చంద్రశేఖర్, సెక్రటరీ బురిడీ త్రిమూర్తులు, అసోసియేషన్ సభ్యులు దుర్గారావుని అభినందించారు.



# అదిరిపోయే డ్రెస్‌లో ఆలియా..

### అందమే అసూయ పడుతుందేమో..

బాలీవుడ్ ముద్దుగుమ్మ ఆలియా భట్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అందం, అభినయం ఈ బ్యూటీ సొతం.ఈ అమ్మడు తన అంద చందాలతో ఎంతో మంది మదిని దోచుకుంది. బాలీవుడ్, టాలీవుడ్‌లో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. చేసిన సినిమాలు తక్కువే అయినా ఈ బ్యూటీకి ఉండే క్రేజ్ మాత్రం మాటల్లో చెప్పలేం. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ఆలియా భట్ గురించి ఎంత చెప్పినా తక్కువే. చాలా తక్కువ సమయంలో ఈ అమ్మడు ఊహించని విధంగా మంచి పాపులారిటీ సొంతం చేసుకుంది. తన అందం, అభినయంతో ఎంతో మందిని ఆకట్టుకుంది. స్టార్ కిడ్‌గా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ చిన్నది వరస సినిమాలో దూసుకెళ్తుంది. తక్కువ సమయంలో స్టార్ హీరోయిన్‌గా సత్తా చాటుతుంది. వరసగా సినిమాలు చేస్తూ బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంటుంది. బాలీవుడ్‌లోనే కాకుండా, టాలీవుడ్ కూడా మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో ఈ ముద్దుగుమ్మ సీత పాత్రలో మెరిసింది. అచ్చం పల్లెటూరి అమ్మాయిలా, తన ప్రేమ కోసం తపించే ప్రియురాలిగా, ఈ బ్యూటీ ఆ సినిమాలో తన నటనతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. ఈ మూవీతో ఈ ముద్దుగుమ్మకు చాలా పాపులారిటీ వచ్చింది. అయితే తెలుగులో పాన్ ఇండియా సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చినా ఈ చిన్నదానికి అంతగా అదృష్టం కలిసి రాలేదనే చెప్పాలి. ఈ మూవీ చేసిన తర్వాత చాలా మంది ఈ బ్యూటీ వరసగా అవకాశాలు వస్తాయి అనుకున్నారు. కానీ ఈ ముద్దుగుమ్మకు మాత్రం ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్‌లో వరసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా గడిపేస్తుంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ రీసెంట్‌గా జరిగినా బీఏఎఫ్టీఏ అవార్డ్స్ ఈవెంట్‌లో రెడ్ కార్పెట్ పై మెరిసింది. ఈ వేడుకల్లో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. దానికి సంబంధించిన ఫొటోస్ ఇప్పుడు వైరల్‌గా మారాయి.

# అరె ఏంట్రా ఇది!

సినీ వాయిస్ CINEMA

### ఎంగేజ్మెంట్ చేసుకున్న షణ్ముఖ్ జస్వంత్.. ఫొటోస్ వైరల్... అమ్మాయి ఎవరంటే?



ప్రముఖ యూట్యూబర్, బిగ్ బాస్ ఫేమ్ నటుడు షణ్ముఖ్ జస్వంత్ తన అభిమానులకు శుభవార్త చెప్పాడు. సడెన్‌గా, సీక్రెట్‌గా ఎంగేజ్మెంట్ చేసుకున్న షణ్ణూ ఆ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. దీంతో పలువురు సెలబ్రిటీలు, అభిమానులు, నెటిజన్లు షణ్ణూకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కవర్ సాంగ్స్, షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్ లతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు షణ్ముఖ్ జస్వంత్. ముఖ్యంగా సాఫ్ట్ వేర్ డెవలపర్, సూర్య వెబ్ సిరీస్ లతో యూత్ లో మంచి క్రేజ్ సొంతం చేసుకున్నాడు షణ్ణూ. ఒకానొక దశలో తెలుగులో అత్యధిక సబ్ స్క్రయిబర్స్ కలిగిన యూట్యూబర్‌గా గుర్తింపు పొందాడు. తన ఆట, మాట తీరుతో రన్నరప్ గా నిలిచాడు. అయితే ఈ బిగ్ బాస్ షో లో సిరి హన్మంతుతో షణ్ముఖ్ నడుచుకున్న తీరు చాలా మందికి నచ్చలేదు. అప్పటికే దీప్తి సునయనతో ప్రేమలో ఉన్న అతను సిరితో ప్రవర్తించిన తీరు ఆడియెన్స్ కు వెగటు పుట్టించింది. ఈ షో ముగిసిన కొన్ని రోజులకే దీప్తి కూడా షణ్ణూకు దూరమైంది. ఇద్దరూ బ్రేకప్ చెప్పుకొని ఎవరి దారి వారు చూసుకున్నారు. దీప్తితో బ్రేకప్ తర్వాత మళ్లీ ప్రేమలో పడ్డాడు షణ్ముఖ్. కొన్ని రోజుల క్రితం ఫేస్ చూపించకుండా ఒక అమ్మాయిని పరిచయం చేసాడు షణ్ణూ. ఇప్పుడు ఏకంగా ఎంగేజ్మెంట్ చేసుకుని ఫ్యాన్స్ కు సూపర్ సర్ ప్రైజ్ ఇచ్చాడు. బుధవారం (ఫిబ్రవరి 25) ప్రేయసి వైష్ణవి చోడిశెట్టి అనే అమ్మాయిని నిశ్చితార్థం చేసుకున్నట్టు ప్రకటించి పలు ఫొటోలు షేర్ చేసాడు. దీంతో ఈ ఫొటోలు కొద్ది క్షణాల్లోనే వైరల్ గా మారాయి. పలువురు సెలబ్రిటీలు, అభిమానులు, నెటిజన్లు షణ్ముఖ్ జస్వంత్, వైష్ణవిలకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కాగా షణ్ణూకు కాబోయే భార్య వైష్ణవి పేరు తప్పితే ఇతర సమాచారం దొరకడం లేదు. కానీ నెటిజన్లు మాత్రం ఆమె గురించి ఆరా తీసే పనిలో పడ్డారు. మరి వీరి పరిచయం ఎప్పుడు, ఎక్కడ జరిగింది? ఎలా ప్రేమలో పడ్డారు? అని తెలుసుకోవాలంటే షణ్ముఖ్ నోరు విప్పాల్సిందే.

క్రీడా వాయిస్

### సెమీస్ చేరే రెండో టీం ఏది..

# చావో రేవో తేల్చుకోనున్న కివీస్, లంక..



టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా సూపర్ 8 ఆరవ మ్యాచ్ శ్రీలంక వర్సెస్ న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ ఇరుజట్లకు ఎంతో కీలకం. ఇప్పటికే ఒక మ్యాచ్ ఓడిపోయిన శ్రీలంక టీం ఎలాడైనా గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. సూపర్ 8 దశలోని ఆరో మ్యాచ్ ఈరోజు శ్రీలంక వర్సెస్ న్యూజిలాండ్ మధ్య జరగనుంది. ఈ మ్యాచ్ కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతుంది. టాస్ సాయంత్రం 6:30 గంటలకు జరగనుంది. శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య 28 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు జరిగాయి. వాటిలో న్యూజిలాండ్ 16 మ్యాచ్‌లు గెలిచింది. శ్రీలంక కేవలం ఆరు మ్యాచ్‌లు మాత్రమే గెలిచింది. రెండు మ్యాచ్‌లు టై కాగా, ఒకటి డ్రాగా ముగిసింది. ఇరు జట్ల మధ్య జరిగిన చివరి టీ20ఐ 2025లో జరిగింది. శ్రీలంక 218 పరుగులు చేయగా, న్యూజిలాండ్ 211 పరుగులు మాత్రమే చేయగలిగింది. శ్రీలంక జట్టులో టాప్ బ్యాటర్ పాతుమ్ నిస్సాంక ఈ టోర్నమెంట్‌లో శ్రీలంక తరపున అత్యధిక పరుగులు చేశాడు. అతను 5 మ్యాచ్‌ల్లో 154.07 స్ట్రైక్ రేట్‌తో 208 పరుగులు చేశాడు. ఇన్నింగ్స్‌లో అతని అత్యుత్తమ స్కోరు 100బి. బౌలింగ్‌లో, మహీష్ తీక్షణ జట్టు తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. అతను 5 మ్యాచ్‌ల్లో 7.12 ఎకానమీతో 8 వికెట్లు పడగొట్టాడు. న్యూజిలాండ్ తరపున లాకీ ఫెర్గూసన్ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్. ఈ టోర్నమెంట్‌లో టిమ్ సీఫెర్ట్ న్యూజిలాండ్ తరపున అత్యధిక పరుగులు చేశాడు. అతను 4 మ్యాచ్‌ల్లో 167.96 స్ట్రైక్ రేట్‌తో 173 పరుగులు చేశాడు. అతని అత్యుత్తమ స్కోరు 89బి. న్యూజిలాండ్ తరపున లాకీ ఫెర్గూసన్ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. అతను 4 మ్యాచ్‌ల్లో కేవలం 9.67 ఎకానమీతో 4 వికెట్లు పడగొట్టాడు.

**పిచ్ రిపోర్ట్:** కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలోని ఉపరితలం స్పిన్ బౌలింగ్‌కు చాలా అనుకూలంగా పరిగణిస్తున్నారు. కొత్త బంతితో బంతి మొదట్లో చక్కగా వస్తుంది. కానీ, కొన్ని ఓవర్ల తర్వాత మధ్య ఓవర్లలో అది భారీగా టర్న్ అవుతుంది. ఈ పిచ్‌పై మొదటి ఇన్నింగ్స్ సగటు 160 పరుగులుగా నిలిచింది. కొలంబోలో 3-4% వర్షం పడే అవకాశం ఉంది. ఫిబ్రవరి 25న కొలంబోలో వాతావరణం వెచ్చగా, మేఘావృతంగా ఉంటుంది. వర్షపాతం చాలా తక్కువ. గరిష్ట ఉష్ణోగ్రత 31 డిగ్రీల సెల్సియస్ ఉంటుందని అంచనా. వర్షం పడే అవకాశం 3-4% ఉంది.

**రెండు జట్ల ప్రాబబుల్ ప్లేయింగ్ 11..**

**శ్రీలంక:** పాతుమ్ నిస్సాంక, కమిల్ మిషార, కుసల్ మెండిస్ (వికెట్ కీపర్), పవన్ రత్నాయకే, దసున్ షనక (కెప్టెన్), కమిందు మెండిస్, దునిత్ వెల్లల్గే, దుషన్ హేమంత్, మహేశ్ తీక్షణ, దుష్మంత చమీర, దిల్షన్ మధుశంక.

**న్యూజిలాండ్:** ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్ (కీపర్), రాచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్‌మన్, డారిల్ మిచెల్, మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), జిమ్మీ నీషమ్, మాట్ హెన్రీ, ఇష్ సోధి, లాకీ ఫెర్గూసన్.

# 'అన్ని సమస్యలకు అతనొక్కడే పరిష్కారమా..

### నీ స్ట్రాటజీతో టీమిండియా పరువు తీస్తున్నావ్‌గా'



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రస్తుతం అన్ని సమస్యలకు ఒక్కటే పరిష్కారం అన్నట్లుగా ప్రవర్తిస్తున్నాడు. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ సమస్యలకు ఆ ఒక్కడినే ఎంచుకుంటున్నాడు. దీంతో కీలక మ్యాచ్‌ల్లో టీమిండియాకు ఘోర పరాజయాలు ఎదురవుతున్నాయి. భారత్ టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 దశలో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత, భారత జట్టు ఎంపికలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా, ఆ మ్యాచ్‌లో అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టి వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులోకి తీసుకోవడంపై మాజీ భారత క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ తీవ్రంగా ఎద్దేవా చేశారు. భారత్ 76 పరుగుల తేడాతో ఓడిపోగా, వాషింగ్టన్ సుందర్ బ్యాటింగ్‌లో కేవలం 11 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. అంతేకాదు, బౌలింగ్‌లో రెండు ఓవర్లు మాత్రమే వేయడం కూడా విమర్శలకు దారితీసింది. ఈ నేపథ్యంలో గౌతమ్ గంభీర్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని మంజ్రేకర్ వ్యంగ్యంగా విమర్శించారు. "ఒకప్పుడు 'కైలాష్ జీవన్' అనే మందు ఉండేది. తలనొప్పి వచ్చినా అదే మందు, కడుపునొప్పి వచ్చినా అదే మందు. అన్నీ సమస్యలకు ఒకటే మందు అన్నట్టుగా గౌతమ్ గంభీర్ దగ్గర కూడా ఒకే పరిష్కారం ఉన్నట్టు అనిపిస్తోంది. అదే వాషింగ్టన్ సుందర్. బ్యాటింగ్ సమస్య అయితే సుందర్, బౌలింగ్ సమస్య అయితే కూడా సుందర్. ఈ మ్యాచ్‌లో అతడిని పై స్థానంలో పంపారు. రింకు సింగ్ నెంబర్ 6కి వచ్చాడు. హార్దిక్ పాండ్యా నెంబర్ 7కి దిగాడు. ఇది కొంచెం అతిగా అనిపిస్తోంది," అని మంజ్రేకర్ స్పోర్ట్స్ నెక్స్ట్ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఈ ఓటమితో భారత్ ఇప్పుడు జింబాబ్వే (గురువారం), వెస్టిండీస్ (ఆదివారం) జట్లతో జరిగే రెండు మ్యాచ్‌లను తప్పనిసరిగా గెలవాల్సిన పరిస్థితిలోకి వెళ్లింది. సెమీఫైనల్ ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే ఈ రెండు మ్యాచ్‌ల్లో గెలుపు అనివార్యం. జట్టు మేనేజ్‌మెంట్ ప్రస్తుతం ఫామ్‌లో లేని బ్యాటర్లలో కనీసం ఒకరినైనా పక్కన పెట్టే ఆలోచనలో ఉందని, అలాగే టాప్ ఆర్డర్‌లో ఎక్కువగా ఎడమచేతి బ్యాటర్లను ఆడించే విధానాన్ని పునర్విచారించనున్నట్లు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సహాయకులు ర్యాన్ టెన్ డోషాటే మరియు సితాంశు కోటక్ సూచించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (నాలుగు మ్యాచ్‌ల్లో 15 పరుగులు మాత్రమే), తిలక్ వర్మ (ఐదు మ్యాచ్‌ల్లో 107 పరుగులు, స్ట్రైక్ రేట్ 118) ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. అంతేకాదు, ఫినిషర్‌గా పేరున్న రింకు సింగ్ 29 బంతుల్లో కేవలం 24 పరుగులు చేసి 82.75 స్ట్రైక్ రేట్‌తో నిరాశపరిచాడు. "హెడ్ కోచ్‌గా, మేనేజ్‌మెంట్‌గా మాకు మార్పులు అవసరమని అనిపిస్తే, తప్పకుండా మార్పులు చేస్తాం. ఇప్పుడు పరిస్థితి అలాంటిదే -- ఏం మార్చాలి? ఎలా మార్చాలి అన్నదానిపై ఆలోచించాల్సిన దశకు వచ్చాం," అని బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ అన్నారు. ఇక, జట్టులో బ్యాకప్ స్పెషలిస్ట్ బ్యాటర్లు లేకపోవడం తమకు ఆందోళన కలిగించే అంశమేనని ర్యాన్ టెన్ డోషాటే అంగీకరించారు. ఫామ్ లేకపోయినా సంజూను మళ్లీ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్ CINEMA
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com